

సంపుట : ౮. ప్రమాది, ఫాల్గుణము : మార్చి, 1940. సంచిక : ౨.

చెన్నపట్టణం దామెర్ల చెన్నప్పపేరపుట్టిందట!

మదరాసును నేటికికూడా దేశీయులు చెన్నపట్టణం అని పిలుస్తారు. అంటే ఏమన్నమాట? ఆపేరే దేశీయులకు బాగా పరిచితమైందీ, బాగా మనస్సుకెక్కిందీ అన్నమాట.

మదరాసుకు చెన్నపట్టణం అనే పేరు ఎల్లావచ్చింది? చెన్నప్పపేర పుట్టింది కాబట్టి. ఈస్థలానికి చెన్నపట్టణం అనేపేరు ఇచ్చిన చెన్నప్ప తెనుగువాడు.

మదరాసులో ఇంగ్లీషువారు 1639 లో కదా గిడ్డంగి స్థాపించారు! అప్పుడు వారు ఇక్కడ గిడ్డంగి స్థాపించడానికి ప్రోత్సాహకర్త అయ్యపనాయుడు. మదరాసుగిడ్డంగి స్థాపకుడైన ఫ్రాన్సిస్‌డే అనే ఆంగ్లేయుడు అప్పటికి ఆర్మెగాన్‌లో వుండినాడు.

ఆర్మెగాన్‌లో వుంటుకున్న ఇబ్బందులవల్ల ఫ్రాన్సిస్‌డే స్థలాంతరంకోసం అన్వేషిస్తూవుండెను. మదరాసుకువచ్చి నెలకొనే కల్పంలో ఇంగ్లీషువారికి అనేకసౌకర్యాలు కల్పించగలనని అయ్యపనాయకుడు ఆర్మెగాన్‌లోని ఫ్రాన్సిస్‌డేకు వ్రాశాడు. ఆ ఉత్తరంలోనే అయ్యపనాయకుడు తనతండ్రి చెన్నప్పనాయకుని పేర ఒక పట్టణాన్ని నెలకొల్పాలనే వాంఛవుందని స్పష్టంగా తెలిపివున్నాడు.

చెన్నప్పనాయకుని ఇంటిపేరు దామెర్లవారు. అతడు కులానికి పద్మనాయకవెలమ. ఆనాటి ప్రఖ్యాతాంధ్రపుత్రులలో అతడు ఒకడు. 1586 మొదలు 1614 వరకు చంద్రగిరిరాజధానిగా విజయనగరాంధ్రరాజ్యాన్ని పరిపాలించిన మొదటి వెంకటపతిరాయల ఆస్థానంలో అతడు ఒక ప్రధానోద్యోగి. చెన్నప్పనాయకుడు సుప్రసిద్ధుడైన వెలుగోటి యాచమనాయకుని బావమరది (భార్యాసోదరుడు).

ఈచెన్నప్పనాయకుడు తన ప్రభువు ఆజ్ఞను అందుకొని వెల్లూరు (రాయవెల్లూరు) కోటను ముట్టడించి దానిపాలకుడైన లింగమనాయకుణ్ణి తరిమివేశాడు. అప్పటినుంచీ వెంకటపతిరాయలకు వెల్లూరు రెండోరాజధానిగా వుంటూవుండేది.

ఆ చెన్నప్పనాయకుడికి ముగ్గురు కొడుకులు. ముగ్గురు కొడుకులూ కూడా అసమానమైన పితృభక్తులు. బాగా ప్రఖ్యాతికివచ్చి తండ్రికి పేరుప్రతిష్టలు సంపాదించారు. ఆ ముగ్గురి కొడుకులపేళ్లు క్రమంగా వెంకటపతి, అయ్యప్ప, అంకభూపాలుడు.

వీరిలో కడపటివాడైన అంకభూపాలుడు తెలుగులో ఉషాపరిణయం అనే ఐదు ఆశ్వాసాల ప్రబంధాన్ని రచించాడు. ఆ ప్రబం

ధాన్ని అతడు తనతండ్రి చెన్నప్పకు కృతి ఇచ్చి పితృఋణాన్ని తీర్చుకున్నాడు.

ఈ ఉషాపరిణయం అవతారికలో అంకభూపాలుడు మదరాసు సంస్థాపనతో తన సోదరుడు అయ్యప్పకుగల సంబంధాన్ని అక్షరరూపంతో వివరించాడు.

ఆరోజుల్లో ప్రళయకావేరిలో (దీనినే ఇప్పుడు పులికాట్ అంటున్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాకు చెందివుంది) డచ్చివారు వలస నెలకొని వర్తకంసాగిస్తూ వుండేవారు. మైలాపూర్ చెంతగల శాంథోములో పోర్చుగీసువారు వలస నెలకొని వర్తకంసాగిస్తూ వుండేవారు. మదరాసుకు ఉత్తరాన్ని వున్న పులికాట్‌లోని డచ్చివారు, దక్షిణాన్నివున్న శాంథోములోని పోర్చుగీసువారు తరుచు కలహిస్తూ వుండేవారు. ఈకలహాలవల్ల పులికాట్ శాంథోముల మధ్య ప్రదేశంలో శాంతిభద్రతలు తరుచు చెడుతూవుండేవి. ఇట్టి కలహాలకు అవకాశం లేకుండా చేయడానికి ఆమధ్య ప్రదేశంలో చెన్నపట్టణాన్ని నెలకొల్పి అయ్యప్పనాయడు దానిని ఇంగ్లీషువారికి ఇచ్చాడు.

చెన్నప్పనాయని కొడుకుల్లో ఇట్లా ఒకడు తండ్రిపేర ఒక పట్టణాన్ని నెలకొల్పాడు. మరిఒకడు తండ్రికి తాను రచియించిన ఒక కావ్యాన్ని కృతిఇచ్చాడు. వేఱొకడైన వెంకటపతికూడా తండ్రిపేరు చిరస్థాయిగా వుండడానికి తటాకప్రతిష్ఠచేశాడు.

1630 మొదలు 1642 వరకు చంద్రగిరిరాజధానిగా విజయనగరాంధ్రరాజ్యాన్ని పరిపాలించిన రెండవ వెంకటపతిరాయలవద్ద ఈ దామెర వెంకటపతి ప్రధాని. ఈ వెంకటపతి చెంజీనగరనాయకుణ్ణి జయించి ఒక గొప్పతటాకాన్ని (ప్రస్తుతం ఉత్తరఆర్కాడుజిల్లాలో) ప్రతిష్ఠచేశాడు. ఆతటాకానికి అతడు తనతండ్రిపేర చెన్నసాగరంఅనే పేరు వుంచాడు.

తండ్రిపేర చెన్నసాగరాన్ని నిర్మించిన ఈ వెంకటపతి తన సోదరుడైన అయ్యప్పకు తండ్రిపేర చెన్నపట్టణం నిర్మించడానికి చాలాసాయంచేశాడు.

ఈ సోదరులు ఇద్దరూ ఇప్పుడు చెన్నపట్టణంవెలసిన స్థలాన్ని ఇంగ్లీషువారికి ఇప్పించడంలో చాలా తోడుపడ్డారు.

ఇందుచేత చెన్నపట్టణస్థలదానకర్తా, స్థలనామకర్తా కూడా తెలుగువారే కావడం రూఢమౌతూవుంది. చెన్నపట్టణం మాది అని చెప్పకోడానికి ఇందుమూలంగా ఆంధ్రులకు మంచిహక్కు ఏర్పడుతూ వుంది.

తెలుగువారి ఈహక్కును పరాస్తంచేయాలనే ప్రయత్నాలు ఇప్పుడు అరవవారిలో ప్రారంభమయ్యాయి.

మదరాసు త్రిశతాబ్ద్యుత్సవ సందర్భంలో అరవల యాజమాన్యాన్ని ప్రచురితమైన స్మారకసంచికలో అరవపండితుడు ఒకడు చెన్నపట్టణం చెన్నప్పపేర పుట్టలేదనీ, ఇక్కడ వెలసిన చెన్నకేశవుని పేర ఈనగరం చెన్నకేశవపురమనే వ్యవహారనామాన్ని ఆర్జించుకొన్నదనీ, చెన్నకేశవపురమే కాలక్రమాన్ని చెన్నపట్టణమైందనీ కొత్తవాదం ఒకటి లేవతీశాడు.

ఈవాదాన్ని లేవతీసిన పండితునిపేరు డాక్టర్ వి. రాఘవన్. అతడు ఎం.ఏ. పట్టభద్రుడు; మదరాసు విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడు.

ఆపండితుడు లేవతీసిన వాదం ఎంతవరకు సత్యసమ్మతమైందో, ఎంతవరకు సత్యసమ్మతమైంది కాదో విమర్శించి తేల్చుకోడానికి ఆ వాద స్వరూపం తెలుసుకోవడం అవసరం కదా! కాబట్టి ఆవాద స్వరూపాన్ని సంగ్రహంగా ఇక్కడ వివరిస్తున్నాను.

"ఆనందరంగవిజయం అని ఒక సంస్కృత చంపూకావ్యం. క్రీస్తుశకము 1752 లో శ్రీనివాసుడు అనే కవి దానిని వ్రాశాడు.

ఆకావ్యం పెరంబూరుకు చెందిన తిరువెంగడంపిళ్ళై, అతని కొడుకు ఆనందరంగంపిళ్ళై జీవితాల్ని కీర్తిస్తూవుంది. ఆనందరంగంపిళ్ళై సుప్రసిద్ధుడైన ఫ్రెంచి దుబాసీ.

తిరువెంగడం పెరంబూరులో ఒకసత్రవు కట్టించాడు; ఒక బ్రా

ఫర్మానాగ్రహారాన్ని నెలకొల్పాడు. అతని భార్యపేరు రామానుజమ్మ. 1709 మార్చి 30-వ తేదీని ఆదంపతులకు ఆనందరంగంపిళ్ళై పుట్టాడు. దరిమిలాను వెంకట అనే కొడుకు కూడా వారికి పుట్టాడు.

కొంతకాలానికి పిమ్మట తిరువెంగడంభార్య చనిపోయింది. అప్పుడు తిరువెంగడం తన ఇద్దరు కొడుకులతో చెన్నపట్టణానికి కాపరం మార్చివేశాడు. అక్కడ అతడు హూణులతరఫుని ఫ్రెంచివారితరఫుని! ఓడలమీద వ్యాపారం ప్రారంభించాడు.

తిరువెంగడం బావమరది నైనియపిళ్ళై. అతడు పుదుచ్చేరిలో ఫ్రెంచివారి పెద్దఏజెంటు. నైనియపిళ్ళై కోరికమీద తిరువెంగడమూ మదరాసునుంచి వర్తకంసాగించడానికి పుదుచ్చేరి వెళ్లాడు. తిరువెంగడంతోబాటు ఆసందర్భంలో మరికొందరు మదరాసు వర్తకులు కూడా పుదుచ్చేరి వెళ్లారు.

ఇంతలో అక్కడ ఫ్రెంచి అధికారులు ఎందుకో నైనియపిళ్ళై మీద కోపగించి అతన్ని ఖైదులో పెట్టారు. అతడు ఆఖైదులోనే చనిపోయాడు.

అప్పుడు అతనికొడుకు గురువపిళ్ళై, తిరువెంగడమూ మదరాసుకు వచ్చివేశారు. కాని ఫ్రెంచి అధికారులు తిరువెంగడాన్ని తిరిగి పుదుచ్చేరికి రావలసిందిగా ప్రత్యేకం ఆహ్వానించారు.

ఆ ఆహ్వానం అందుకుని తిరువెంగడం మదరాసునుంచి పుదుచ్చేరికి పోతూపోతూ ఇక్కడనుంచి కొందరు వర్తకుల్నికూడా తీసుకువెళ్లాడు. 1726 లో తిరువెంగడం చనిపోయాడు. అనంతరం అతని స్థానంలో అతనికొడుకు ఆనందరంగాన్ని నియమించారు.

ఆనందరంగ విజయ చంపూకావ్యంలోని ఇతివృత్తం ఇది. ఇందులో రెండుమూడుచోట్ల మదరాసు ప్రస్తావనవుంది. ఆప్రస్తావనలో చెన్నపట్టణానికి రెండుచోట్ల చెన్నకేశవపురం అనేపేరు ఉదాహృతమైంది.

తిరువెంగడం భార్యమరణానంతరం పెరంబూరునుంచి మదరాసు కాపరంవెళ్ళిన ఘట్టాన్ని వర్ణించే సందర్భంలో మదరాసుకు చెన్నపట్టణం అనేపేరే ఉదాహృతమైంది. చూడండి :

తిరువేంకట భూపాలః కదాచిత్
చెన్నపట్టణమ్।
దిట్పృక్షుస్సాత్మజః ప్రాయాదాత్మ
సైస్వైరనుమతః॥'

పుదుచ్చేరినుండి గురువపిళ్ళైతో తిరువెంగడం మదరాసు తిరిగివచ్చిన ఘట్టాన్ని వివరించే సందర్భంలో ఐదవ అధ్యాయంలో మదరాసుకు చెన్నకేశవపురం అనే నామం ఉదాహృతమైంది. తిలకించండి :

—'ప్రధ్వస్తసాధ్వసః చెన్నకేశవపుర
మేత్య—'

తిరువెంగడం తిరిగి పుదుచ్చేరి వెళుతూ ఇక్కడనుంచి వర్తకుల్ని తీసుకుపోయే ప్రకరణాన్ని ప్రస్తరించే సందర్భంలోకూడా చెన్నపట్టణానికి చెన్నకేశవపురం అనే పేరు ఉదాహృతమైంది. గమనించండి :

'న్యాయవృత్తముదిత శ్రీచిరాయస్వ
నిషేవితు మంధోద్యతమారాత్
అనినాయసపురం నవమేతత్
చెన్నకేశవ పురాయకసాధమ్॥'

ఇప్పుడు సెయింటుజార్జికోటవున్న మదరాసుభాగాన్ని ఇంగ్లీషువారికి ఇప్పించిన దామెర్ల వెంకటపతినాయడి తండ్రి ఐన చెన్నప్పనాయనిపేర చెన్నపట్టణం పుట్టిందని సాధారణమైన నమ్మిక ఐవుంది.

కోటకట్టిన భాగాన్ని స్థలదానకర్త ఐన వెంకటపతి తన తండ్రి చెన్నప్పపేర పిలవాలని వాంఛించినట్లు చెబుతారు. వెంకటపతి నాయని సంబంధీకులు తమ వంశకథల్లో చెన్నపట్టణం తమ పూర్వీకుడైన చెన్నప్పపేరనే పుట్టిందని వ్రాశారు. చెన్నపట్టణం స్థలదానకర్త తండ్రి చెన్నప్పపేరనే పుట్టడం కంపెనీవారి రికార్డులలో కొన్నిటిలో వుండనూవుంది.

ఐనా – మదరాసుపటంలో కాని, మదరాసుపటంచెంత కాని కోటకట్టుకోడానికి ఇంగ్లీషువారికి అనుమతి ఇస్తూ ఫ్రాన్సిస్‌డేకి దామెర్ల వెంకటపతినాయకుడు ఇచ్చిన 1639 అక్టోబరు 22-వ తేదీనాటి ఫర్మా

నాలో మాత్రం ఆ ప్రదేశాన్ని తన తండ్రిపేర చెన్నపట్టణం అని పిలవాలనే షరతు వుంచలేదు.

చెన్నపట్టణం అనేపేరు విషయంలో మద్రాసు చరిత్రకారుడు హెన్రీ డేవిసన్ లవ్ ఈక్రింది నిర్ణయాలు చేస్తున్నాడు :

1. వెంకటపతి నాయకుడు ఇంగ్లీషువారికి ఈయకపూర్వం కోట భాగానికి అసలుపేరు ఏదోవుండి వుండాలి.

2. అసలుపేరు చిన్నపటమ్ ఐ వుండవచ్చు.

3. చెన్నప్పపేరుతో ఈస్థలానికి సంబంధం తరవాత కల్పితమై వుంటుంది.

4. చిన్నపటమ్ అనేపేరు చెన్నకేశవపెరుమాళ్లు ఆలయానికి నాగబత్తుడు అనేవాడు 1644 లో ఇచ్చిన దానం సందర్భంలో ఉపయోగితమైంది.

ఈ చెన్నకేశవపెరుమాళ్ళ ఆలయం ఆదిలో కోటభాగంలో వుండేది. బహుశా అది ఇప్పుడు హైకోర్టువున్న ప్రదేశంలో వుండివుండును. ఆనాటికి ఆప్రాంతంలో ఒక్కటే విష్ణ్వాలయం వున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ఈ చెన్నకేశవుని ఆలయంపేరనే ఈప్రదేశం చెన్నకేశవపట్టణం లేక చెన్నకేశవపురం అనేపేరు పొందింది. చెన్నకేశవపట్టణం లేక చెన్నకేశవపురం అనే దీర్ఘనామం కాలక్రమాన్ని చెన్నపట్టణం అనే చిన్నపేరుగా వ్యవహారంలో నిలిచిపోయింది.

కాబట్టి చెన్నకేశవస్వామివారి పేర ఈప్రదేశానికి చెన్న (కేశవ) పట్టణం అనేపేరు వచ్చిందే కాని, వెంకటపతి ఈ ప్రదేశాన్ని తన తండ్రి చెన్నప్పపేర పిలవాలని కోరినందువల్ల రాలేదని స్పష్టమవుతూ వుంది. ఆనందరంగచంపువు ఈ సంగతిని రూఢంచేస్తూవుంది.''

డాక్టర్ వి. రాఘవన్ పండితుని వాద సారం ఇది.

తెలుగువాడైన చెన్నప్పపేర చెన్నపట్టణం పుట్టలేదనడనికిగాను పాక్షికదృష్టితో లేవతీయబడినవాదమేకాని ఇది సత్యసమ్మతమైనది కాదు.

చెన్నప్పపట్టణం చెన్నపట్టణం అయిందంటే నమ్మదగిందిగా వుంటుందో, లేక చెన్నకేశవపట్టణం చెన్నపట్టణం అయిందంటే నమ్మదగిందిగా వుంటుందో నిష్పాక్షిక దృష్టితో చూస్తే సులభంగానే అవగతమౌతుంది, చెన్నప్పపట్టణం చెన్నపట్టణం కాలేదు చెన్నకేశవపట్టణమే చెన్నపట్టణం ఐందని వాదించడానికి ఆవాదకుడు అమాంతంగా కేశవశబ్దాన్ని మింగివేయవలసివచ్చింది. మదరాసు ఆంధ్రులదికాదు అని నిరూపించడానికి అరవవారికి ఉన్నఉత్కంఠలో వారు కేవలం కేశవుణ్ణే మింగివేయవలసినవారు అవుతున్నారు. వారి ఉత్కంఠ సత్యప్రేరితమైంది కాకపోయినా తప్పకుండా దయనీయమైంది అయివుంది !

చెన్నప్పపేర చెన్నపట్టణం నిర్మితమైందనే విషయాన్ని తెలిపే ఉషాపరిణయం కొంచెం ఇంచుమించు చెన్నపట్టణసంస్థాపనతో సమకాలీనమైంది. ఇక చెన్నపట్టణం అనే పేరు చెన్నకేశవపట్టణం నుండి ఏర్పడిందనడానికి ప్రమాణంగా చూపబడే ఆనందరంగవిజయ చంపువు 1752 లో పుట్టింది. 1640 ప్రాంతంనాటి ఉషాపరిణయము ఈ విషయంలో ప్రామాణికమైందో, దానికి నూరు సంవత్సరాల పిమ్మట పుట్టిన ఆనందరంగవిజయ చంపువు ఈవిషయంలో ప్రామాణికమైందో ఉచితజ్ఞులు సులభంగానే పోల్చుకోగలరు.

చెన్నప్పపేర ఒక్క చెన్నపట్టణమనే ఊరేకాదు చెన్నసాగరమనే చెరువుకూడా వెలసింది. అతనిపేర ఊరు, చెరువుకూడా వెలయించినవారు అతనికొడుకులు. అతని మరి ఒక కొడుకు ఆవిషయాల్ని గ్రంథస్థంచేశాడు. కంపెనీవారి రికార్డులలోకూడ ఈవిషయం గ్రథితమైవుంది. ఐనా రాఘవన్ పండితుడు ఆవిషయంలో సంశయగ్రస్తుడు అవుతాడు. కంపెనీవారి రికార్డులలో లేక, చెన్నపట్టణం పుట్టిన నూరు సంవత్సరాల దరిమిలాను రచితమైన ఒకానొక సంస్కృత కావ్యంలో రెండుచోట్ల చెన్నపట్టణానికి పర్యాయపదంగా చెన్నకేశవపురం అని వుండడంచేత చెన్నపట్టణానికి అది మూలనామం అని మనం నమ్మితీరాలట !

కలిగినవాడిగాదెతీసేసరికి పేదవాడిప్రాణాలు పోతాయి!

పాలేరు వెంకడు

"చేతులో మందుపొట్లం వెళ్ళి ఎండి పోయిన గంజిగుంటలో పడింది. కొట్టుకుపోయిన వెంకడి మోచేతి నుండి రక్తబిందువు చెదరి రత్తి పెదిమల మీద పడింది."

రచయిత :

పి. శివరామమ్

౧

"ఒరేయి వెంకడూ! ఆవుని దొడ్లో కట్టెయ్యి."

* * *

"వెంకా! బజారుకు పోయి నాకో లబ్బరుబంతి తెచ్చిపెట్టవురా?"

* * *

"నాయినా! ఒరేయి, వెంకడ్ని పంపి ఓఅణా పళ్లు తెప్పించవుట్రా. శుక్రవారం. గుళ్లోకి పోవాలి.

* * *

"వెంక డేడండీ? అప్పలస్వామి అరటికాయలు పంపిస్తానన్నాడు. ఇంకా పంపలేదు. వంటవేళయింది. వెళ్ళి పట్టుకు రమ్మనకూడదూ?"

* * *

వీధులో కూర్చున్న పాలేరు వెంకడు కరణంగారి కేకకు లేచి ఆవుని శాలలోకి మళ్ళిస్తూ చిన్నమ్మాయి కోరికకు 'అల్లాగే' నని తలూపి గేటుదాకా వెళ్లాడు.

ఇంతలో కరణంగారి తల్లి పురమాయింపూ, వెంటనే అమ్మగారి సాధింపూ వినబడ్డాయి.

నిమిషం తీరిక లేదు. ప్రొద్దున్నే గంజిత్రాగి వచ్చాడు. మధ్యాహ్నం యింటికి పోదాం- రెండు రోజులనుంచి జ్వరంతో పడుంది పెళ్ళాం- మందేమిటో మాకేమిటో చూద్దా మనుకుంటే- తెమిలితేనా? యిరవై నాలుగ్గంటలూ పనే.

అవసర మెల్లాగున్నా ప్రత్యేకం వెంకడిచేత పని చేయించేందుకైనా మరొక నాల్గుగంటలు ఎక్కువయితే బాగుండు నని ఆలోచిస్తూ వుంటాడు పంతులు—

* * *

వెంకడి తాత, తండ్రికూడా కరణంగారి దగ్గరే పనిచేశారు. వెంకడితాత సుబ్బడు ఆజానుబాహుడూ, మంచి నమ్మకమైన వాడూను.

రామప్పంతులు కరిణీకం చేతపుచ్చుకునేటప్పటికి యిరవై యేళ్ళ యువకుడు. వూరంతా పార్టీలతోటీ, కక్షలతోటీ నిండి వుండేది. "బాబుగారి యిసయంలో ఎవళ్ళయినా చరే అన్నేయం తలపెట్టేరంటే నారత్తంకూడా ధారపోత్తా" ననేవాడు సుబ్బడు. ఆవైభై యేళ్ళ వయస్సులో వాడు యెదుటి పార్టీకి యముడయ్యాడు. పంతులుని నీడలాగ వెంబడించేవాడు. చివరికి పార్టీగొడవల్లో పడి పాపం రాత్రికి రాత్రి గొడ్డలిదెబ్బలు తిని చచ్చిపోయాడు.

సుబ్బడుకొడుకు రాజియ్యకూడా మహానమ్మకంతో వుండేవాడు. కరణంగారి కొలువు ఆట్టేరోజులు చేసే అదృష్టం లేకపోయింది రాజియ్యకి దొడ్లో పురుగూదితే చచ్చిపోయాడు—

అప్పటికి వెంకడికి పద్నాలుగేళ్ళుంటాయి. అప్పట్లో ఆదిక్కులేని కుటుంబంమీద సానుభూతి కనబర్చడం రామప్పంతులు తన విధి అనుకున్నాడు.

వెంకడ్కి నెలకి ఒకరూపాయి సాదరుఖర్చు కిస్తానని చెప్పి సంవత్సరానికి రెండుబస్తాలు ధాన్యానికి పనికి కుదిర్చాడు.

ఈ యిరవై యేళ్ళుగా తండ్రితాతల పేరు నిలబెట్టాడు పాలేరు వెంకడు. కరణంగారే పెళ్ళిచేశారని అందరితోటీ చెప్పుకునేవాడు వాడు—నిజానికి సాటికులంలోని రత్తిని తనే చూసుకుని స్వయంగా మాట్లాడుకుని చేసుకున్నప్పటికీని.

ఇంట్లో కరణంబాబు మొదలుకుని చిట్టిబాబుగారి వరకూ ఎవరేంచెప్పినా సరే విసుక్కోకుండా ఏపనైనా సరే చెయ్యడానికి సిద్ధమవుతూ వుండేవాడు.

* * *

ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత- సంసారకూపంలో పడి నలిగిన తర్వాత ఆ గంజి మీద- నూకల కూడు మీద ఆధారపడున్న-బక్క పేగుల జీవం- యిదివరకంత చురుకుగా పనిచేయడం లేదని అంతా విసుగుకుంటే మాత్రం ఏం లాభం? అక్కడికీ ఒక్క నిముషమయినా వూరికే కూర్చోకుండా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనేవుంటాడు-

ఇంట్లో ఒక పనయిన తర్వాత మరొకటి గాదామె! కరణంబాబు పని చెప్పిన సమయానికే ముసలమ్మగా రేదో చెబుతుంది. వినకపోతే ఆవిడ నానామాటలూ అని "ఆఖరికి పాలేరువెధవకూడా యీ ముసిల్ది చెప్పడమేం! నేను వింటమేం? అనే పట్టుంటే- నేనెందుకూ" అని సాగదీసుకుంటూ మాట్లాడుతుంది.

ఇంతలో అమ్మగారు వచ్చి ఏదో పురమాయిస్తారు. చెయ్యలేకపోతే ఛీవాట్లు.

బయటికి కదుల్దామంటే బుల్లమ్మాయిగారు వచ్చి ఏమి టేమిటో చెబ్తుంది. యిల్లా గడుపుతున్నాడు జీవితం- వెంకడు.

"బాబుగారూ! ఆ రయింది గడియారం కొడితే యిన్నా. యింక ఇంటికి కెల్తానండి, బాబయ్యా!" అన్నాడు అరుగుక్రింద నిలబడి వెంకడు.

"దూడకు గడ్డేశావా? అవుకు చిట్టూ—"

"అన్నీ శేసానండయ్యగారూ! పొద్దున్నే ఒచ్చానండి. యింటికాడది లేవడం లేదండి బాబుగారూ! లంకణాలుండి. పిల్లలకి గంజోసే దిక్కు నేదు. బేగే ఎల్లాలుండి" అన్నాడు ఎంతో ఆత్రంతో- ఆవేదనతో-

"వెంకా! పూజారి కామయ్యను గుడితాళంచెవులు తీసుకుని వెంటనే రమ్మని చెప్పు" అని తలుపు వెనకనుంచి కేకేశింది కరణంగారి భార్య.

"సెప్పి అక్కణ్ణుంచి ఇంటికెల్తానండయ్యగోరు."

"ఊఁ-" అన్నాడు కరణంబాబు.

వెంకడు ఒక్కసారి ఊపిరి ఘట్టిగా పీల్చి గబగబా నడవడం మొదలెట్టాడు. యిరవై అడుగులేసేసరికి "వెంకా! ఒరేయి!" అని కేక వినబడింది.

గుండె జారిపోయింది వెంకడికి. యింటికి వెళ్ళాలని ఎంత తొందర పడుతున్నాడో- యింట్లో పెళ్ళాం పిల్లలకోసం ఎంత ఆదుర్దా పడుతున్నాడో అంత ఆలస్యమైపోతోంది.

గబగబా వెనక్కి పరుగెత్తుకొచ్చాడు. "ఒరేయి! నాయుడుగారి కృష్ణారావు నోసారి నేరమ్మన్నానని చెప్పు" అన్నాడు అరుగుమీద నిలబడి పంతులు.

"సిత్తం, బాబయ్యా!" అని పరుగెత్తేడు వెంకడు.

అప్పటి కారున్నరయింది. పూజారింటి కెళ్ళాలి; నాయుడుగారింటి కెళ్ళాలి.

ప్రొద్దు న్నొచ్చాడు. పెళ్ళాని కెల్లా వుందో? పిల్లలు ఆకలని ఎంత మాడిపోతున్నారో? యిదే ఖంగారు వెంకడికి.

౨

"అయ్యా! మొక్కజొన్నేదిరా? తెత్తానని సెప్పినావు" అంటూ వెనకాలే నిలబడ్డాడు పెద్దకొడుకు అయిదేళ్ళవాడు.

కాళ్ళూ మొహం కడుక్కుంటూన్న వెంకడు వెనక్కి తిరిగి "మీ అమ్మ కెల్లా గుందిరా? యీపూట లేసిందా?" అన్నాడు.

తండ్రిమాట వినపడగానే గుడి

సెలోంచి వెంకడికూతురు మూడేళ్ళది మెల్లిగా బయటకొచ్చి "అయ్యా! అయ్యా!" అంటూ కాళ్ళకు చుట్టేసింది.

దాన్నెత్తుకుని లోపలకొచ్చి చింకిచాపమీద పడుకున్న రత్తి తలదగ్గిర కూర్చున్నాడు వెంకడు.

"ఎల్లాగుందే?"

"శానా నిత్రాణగా వుంది. పిల్లదాని కూ్కంత నూకలజావ యీరయ్యమామిత్తే పోశాను. గుంటగాడి కింతవరకూ కూడు లేదు" అంది రత్తి హీనస్వరంతో.

ఏడాది పిల్లాడు వెంకడి రెండో కొడుకు తండ్రివైపు తిర్గి చేతులు జాపాడు. రత్తిప్రక్కలోంచి వాడ్ని తీసుకుని ముద్దుపెట్టుకుని "యిప్పుడు కూంత నూక లుడికించి పెడ్తా" నన్నాడు వెంకడు పెళ్ళాం కళ్లల్లోకి చూస్తూను.

"ఏం? కూసిని బియ్యా నుడిగి పట్రాకపోయినావ్ పంతులుబాబింట్లో" అంది రత్తి.

వెంకడు తెల్లబోయాడు. యింట్లో ఒక్క గింజయినా లేదు. కాసిని నూకలుంటే ప్రొద్దున్న తను నూకలజావ కాచుకుని త్రాగాడు. సందెకాడ వొచ్చేటప్పుడు కరణం బాబు నడిగి తెద్దా మనుకున్నాడు. కాని ప్రొద్దు గూకేసర్కి పగలల్లా పనిచేసి చేసి వుండి అలిసిపోయిన మీదట- ఎప్పు డిక్కడ నుంచి విడుదలై పోతానా అని వుండి పెళ్లాంమీాది ధ్యాసచే పరుగెత్తుకొచ్చాడే కాని తిండానికింట్లో నూకల్లేవే నని యోచించే వ్యవధి లేకపోయింది వెంకడికి.

కాస్సేపాలోచించాడు.

"ఒసే పిల్లా! నే కరణంబాబింటికెల్లి అరగంటంగో ఒత్తా." అని చెప్పి పరుగెత్తాడు. మాలగూడెం నుంచి అరమైలుదూరం- ఆ చీకట్లో డొంకల్లోంచి పడి పోవాలి కరణ మింటికి.

* * *

ఆరోజు గడిచింది.

3

తెల్లవారింది- రోజూకన్న గంటముందుగా వెళ్లాడు వెంకడు కరణ మింటికి "వారేయి! వెంకా, యివేళ చిట్టమ్మాయిగారూ, పిల్లలూ వస్తున్నారు. స్టేషన్‌కి బళ్ళు కట్టించు కెళ్ళాలి." అన్నాడు సావిట్లో చుట్టకాలుస్తూ కూర్చున్న కరణం.

"బాబుగారూ! యింటికాడ సచ్చేపాణంగా వుందండి దానిగతి. పిల్లగాళ్లూరికే ఏడుత్తుండారుండి. యియ్యేళ శెలవిప్పిత్తారని కర్చుకేమైనా ఓరూపాయి దయిసేయిత్తారనీ వచ్చానుండి" అన్నాడు చేతులు జోడించి వెంకడు.

కరణం మొహం చిట్లించి "మరి బళ్లు తీసుకుని స్టేషన్ కెవ రెళ్తారు నీబాబు!" అన్నాడు.

వెంకడి కీమాట చాలా కష్టంతోచింది. "సచ్చిన నాబాబు చంగతెందుకండీ- ఏమీా పనిసేయక కూర్చుంటాడు తాతిగాడ్ని—"

"నోర్మూయ్యి. వొకళ్ళమీాద అజమాయిషీకి పెట్టా ననుకున్నావా నిన్ను? పొగరెక్కి మాట్లాడుతున్నావు."

"సమించం డయ్యాగోరూ! నా పెళ్ళానికి పాణంమీాద కొచ్చిం దుండి- అందుకోచమని యింత ఏడుకుంటున్నా యియ్యేల్టికి—"

"నీ పెళ్లానికి జ్వరమయితే యీవేళ అమ్మాయిని రావద్దంటావ్రా! నీ తీరుబడి చూసుకుని బయల్దేరవలశిం దన్నమాట ప్రయాణాలు వోరి—" అంటూ నోరు నొక్కుకుంది కరణంతల్లి.

"వారేయి నాయుడుగారిబండీ, మనబండీ గూళ్లు కట్టించి తోలించుకుని—"

"బాబుగారూ! ఎవళ్ళనయినా పంపించండి. నే నియ్యేల కింటికాడికి పోవల్సిందే. పిల్లల కొండిపెట్టే దిక్కునేను. అది రోగంతో సత్తావుంది" అన్నాడు కళ్ళవెంబడి నీరు కాగుస్తూను.

"ఏడాది కోపిల్లాడ్ని కంటూ- దరిద్రమో- తినడానికి కూడో- అంటూ- అరుపు లేస్తారు యీ వెధవ అల్కజాతి- అల్లా పొర్లి- కని పోసి- యింటిసిండా పిల్లలతోటి దరిద్ర మనుభవించడమేమో?" అని సాగదీసుకుంది- ముసిలావిడ.

"వారేయి ఎవళ్ళూ లేరు. తప్పదు. నువ్వువెళ్ళి అమ్మాయిగార్ని

బళ్లెక్కించి కావలిస్తే అక్కడినుంచింటికి పో'' అన్నాడు పంతులు.

గ్రుడ్ల నీరు క్రుక్కుకుంటూ ''నే నెల్ల లేనండీ- దానికి—'' అని యింక మాటాడలేక గిఱ్ఱున తిర్గి వెళ్ళిపోయాడు వెంకడు.

౪

వెంకడు కొంపకు జేరే టప్పటికి పెద్దకుఱ్ఱాడు వీధులో ఏడుస్తూ నిలబడి వున్నాడు. కుఱ్ఱది గుమ్మందగ్గిర కూర్చుని తల్లివంక చూస్తోంది. ఆత్రుతగా వెంకడు లోపలికి వచ్చాడు. రత్తి వూరికే ఆయాస పడ్తూవుంది. ఎగూపిరీ, దిగూపిరీ గా వుంది-

''రత్తీ!'' అన్నాడు వెంకడు. ఆపిలుపులో ఎన్ని శ్రుతులు? ఎన్ని రాగాలు మేళవించున్నాయో ఆ భగవానుడికే తెలుసు.

ఆయాసంతో కళ్ళు తెరిచింది రత్తి. వెంకడిచెయ్యి పట్టుకుంది. ''పిల్లాడు ఏడుస్తున్నాడు. పిలవండి'' అంది ఆయాసంతో. లోపలికి వచ్చిన కొడుకుని దగ్గిరిగా తీసుకున్నాడు. వాడింకా ఏడుపు మానలేదు.

కుఱ్ఱది అన్నను చూసి తనూరుకోడ మెందుకని మెల్లిగా మంధరస్థాయిలోనుంచి ప్రారంభించి శ్రుతిలో కలిపింది :

ప్రక్కలో కుఱ్ఱాడు వీళ్ళఏడ్పు విని కెవ్వు మన్నాడు.

''రత్తీ! పూజారి కామయ్య డబ్బిస్తేనే కానీ మం దివ్వనన్నాడు. కరణంకాడిక్కి పోతే పనిసెయ్య మని చెప్తాడు.''

రత్తి వూరికే ఆయాసపడ్తూ అతికష్టంతో కళ్లు తెరుస్తోంది. ఏదో బాధ- యాతన—

పిల్లలకు ఆకలి- అందులో అమ్మ పల్కదని మరీ ఏడుపు.

వెంకడి కేమీ తోచదు.

కామయ్య- మాత్రయిస్తే ప్రయోజన ముందని తనకు తెలుసు. కాని డబ్బు ఇవ్వందే చస్తే మం దివ్వనన్నాడు పూజారి. ఇం కేందోవ? పోనీ వొకరూపాయి- ఆఖరికి అర్ధరూపాయైనా యిస్తాడేమో పంతు లంటే- ఊహు- స్టేషన్ కు వెళ్ళ మంటాడు. ఇంటిదగ్గిర చచ్చే ప్రాణంగా వున్నా సరే. పాషాణ హృదయాలు-మళ్ళీ ఖామందులు-

తను పాలేరు- వెట్టి వెధవ-

* * *

ఆలోచించడాని కవకాశం ఏదీ?

ఆకలితోటి డొక్క లెగరేసుకుంటూ వూరికే ఏడుస్తున్నారు పిల్లలు- కన్ను తెరవడాని కోపిక లేకుండా ఆయాసంతోటి రత్తి-

ఆలోచించాడు వెంకడు- 'మళ్ళీ వొక్కసారి కామయ్యదగ్గిర కెళ్లి బ్రతిమాలుకుంటే-' పిల్లల ఏడుపుకూడా వినిపించుకోకుండా పరుగెత్తాడు బయటికి-

౫

'బాబయ్యా!'

* * *

'శాత్తులుగోరూ!'

* * *

'బాబుగోరూ- అయ్యా!'-

'ఏరా! చెవికోసిన మేకలాగ అల్లా అరుస్తా వెందుకూ?'

'బాబుగారూ! నా పెల్లాని కాయాసం యెక్కువయిందండి. వూపిరికూడా యెగనాక లేకుండా వుందయ్యా! మం దిచ్చారంటే బతుకుతుంది. దణ్ణా లెడ్తానండి.'

'ఇవ్వ నన్నానుట్రా! ఒక్క మాత్రకి రెండురూపాయలు తీసుకోవలశిందే. దేవీప్రసాదితమైన ఔషధం- బీదవాడివని కనికరంతో- రూపాయి ఇమ్మన్నాను. ఎంత దయాహృదయంతో'- ఆ- సరే- ఇల్లా గిరవా పెయ్యి.'

'అయ్యగోరూ! ఎంత సచ్చినా డబ్బు దొరకనేదండీ. ఏం చేసేది? కరణంబాబు నడిగితే ఆయనగోరేదో పని శెప్పారుండి. ఏడకో పోయిరావా లంటండి. జాంపొద్దెక్కుతా దొచ్చాటప్పటిక్కి. అప్పటిక్కి యింటిదాని పాణా లుంటాయో, వూడతాయో! బాబుగారూ! తమపేరు తల్చుకుంటా మండీ తరతరాలు- మద్దాన్నపే లట్టుకొచ్చి డబ్బు దాఖలు సేసుకుంటా యిప్పుడు మందు దయసేయించండి - ఎల్లాగైనా—'

'నీతాత సొమ్మే మైనా దాచపెట్టావుట్రా యిక్కడ?- అసలు తెల్లనాణాన్ని దేవీవిగ్రహంముందు పెట్టందీ మందుపెట్టి ముట్టుకునేందుకు- హమ్మయ్యో- దేవీద్రో

హం చెయ్యమంటావుట్రా? పశువా! వీల్లేదు. మధ్యాహ్నమే రా— ఇంతలో ఏమీ ఫర్వాలేదు— మునిగిపోలేదు'' అని వెనక్కి తిరిగాడు పూజారి కామయ్య.

'బాబుగారూ! బాబూ : యిన్నపం యినండి, తమకడుపున బుట్టి—'

'ఛా, మాలపీనుగా— నోర్మూయ్యి, ఉచ్చనీచాలు తెలియక పేల్తావ్' అని తలుపు, భడేలున వేశాడు కామయ్య.

ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకొని సందు చివరదాకా వెళ్ళాడు వెంకడు. పరుగెత్తుకు వచ్చాడు గూడెం నుంచి. రాత్రి పంతు లింటినుంచి తెచ్చిన కూకలు పిల్లల కొండిపెట్టి తను బెంగతో ఏమీ తినకుండా రత్తిప్రక్కనే జాగరణ చేశాడు. ప్రొద్దుటినుంచి తిరగడంగా వుంది. లోపల దిగులు—

ఎదురుగా తాతిగా డొస్తున్నాడు. 'ఏరా యెంకా! బళ్ళొచ్చి గుమ్మంకా డున్నాయి. తోలించు కెళ్ళి అమ్మాయిగోర్ని తీసుకు రాగూడదంట్రా' అన్నాడు.

వెంకడు తలెత్తి చూశాడు. పోనీ తాతిగాడు చెప్పినట్లు చేద్దామా అనిపించింది. అయితే పన్నెండు గంటల వరకూ తిర్గి రాలేదు. అప్పటికి రత్తి గ తేంగాను? పిల్లలు మాడిపోరూ ?

మరి వేరే గత్యంతరం లేదు—

కరణంబాబు గుమ్మంముందు నిలబడి వున్నాడు. వెంకడ్ని చూడగానే 'ఏరా? వెడ్తావా?' అన్నాడు—

'సిత్తం. బాబయ్యా! ఒక్కరూపాయి దయసేయించుండి బాబుగారూ!' అని కళ్ళనీళ్లు తుడుచుకున్నాడు.

కరణం లోపలి కెళ్ళివచ్చి 'త్వరగా బళ్లు తోలించు కెళ్లు. రాగానే యిస్తాను. నాదగ్గి రేమీ చిల్లర లేదు. కోమటి శేషయ్యకైనా చీటీ రాసిస్తానులే— వచ్చిన తర్వాత' అన్నాడు.

వెంక డొక్క నిట్టూర్పు విడిచాడు. తనయందు— యిన్నిసంవత్సరాలు నమ్మకంతో కొలుస్తూ వున్న తనమీద అపనమ్మకం— రూపాయి తీసుకుని వెళ్ళక——యింటికి పోతాడేమో ననే——సంకుచితాభిప్రాయం.

వెంకడు చిన్నబుచ్చుకున్నాడు యీ ఆలోచన తట్టగానే——

వెనక్కి తిర్గి ఎడ్లముందుకు పోయి ముక్కుతాడు పుచ్చుకుని బయలుదేరాడు. ఎడ్లమెళ్ళో ఘంటలు ఘల్లు మన్నాయి బళ్లు కదలగానే— వెంకడి వళ్ళు ఝల్లుమంది.

అది పశువు— వీడు పాలేరు——

౬

'అమ్మాయి గోరు! యీడనుంచి యింటిదాకా వత్తే శానా ఆలస్యమవుతుందండి. యింటికాడ నా పెళ్లాం జొరంతో బాధ పడ్తావుంది- పిల్లల్కి కాచి పోశే దిక్కు నేదు- యింటి కెల్తానండి.' అన్నాడు బండిలో కూర్చున్న అమ్మాయిగారి తోటి వెంకడు-

'సరే, పో!' అంది కరణంకూతురు. పోకండా వెంకడు చేతులు కట్టుకు నిలబడ్డాడు.

'ఏరా! వెళ్లు పోసీ' అంది అమ్మాయి మళ్ళీ.

'అమ్మాయిగోరూ! యింటిదానికి పాణంమీద కొచ్చిందండి. డబ్బిత్తేనేకానీ పూజారి మం దివ్వనన్నాడు. బాబుగా రిప్పుడింటి కెల్తే యిత్తానన్నారు. కాని శానా ఆలస్యమవుతుంది. తమరుగానీ దయసేయిత్తే- మీపేరు తల్చుకుంటా- దానికి జీవా లిచ్చినోరగుతారు' అని కళ్ళనీరు తుడుచుకున్నాడు.

'తీసుకో! పాపం' అని పెట్టి తీసి రూపాయి వెంకడిచేతులోకి గిరవాటేసింది.

వెంకడికి కొండెక్కిన ట్లయింది ఒక్క దణ్ణంపెట్టి బండివాళ్ళను త్వరగా తోలమని చెప్పి తనూరివైపుకి పరుగెత్తాడు. అడ్డుదారిని గట్లమీద పరుగెత్తాడు. ఎక్కడ పరుగెడు తున్నాడో- ఏమి గుచ్చుకుంటున్నాయో—ఏ మడ్డమొస్తున్నాయో కూడా తెలియడం లేదు.

తిన్నగా పూజారి కొంపకి జేరాడు. పదిసార్లు అరిచినా తలుపు తియ్యలేదు పూజారి. ఆఖరికి విసిగి- తెగించి—గుమ్మంయెక్కి తలుపు ఘట్టిగా కొట్టాడు.

కామయ్యా తలుపుతీసి 'హోరి, నిన్ను నరికెయ్యా! దుర్మార్గుడా! పైకివచ్చి- తలుపుముట్టుకుని- ఛండాలుడా!' అని తిట్లు ప్రారంభించా

డు. ఇంకా తిట్టేవాడే. ఎంత గోలైనా చేసేవాడే. కాని వెంకడిచేతులో తెల్లనాణెం మెరుస్తోంది. కామయ్య నోరు కట్టుబడి పోయిందంతే—

'ఏరా, ఏం?' అన్నాడు.

వెంకడు రూపాయి గుమ్మంలోకి గిరవాటేసి 'బాబయ్యా! తొరగా దయసేయించుండి. మందు. బేగే సామీ' అని వణుకుతూన్న కంఠంతో ఆత్రంతో అన్నాడు.

కామయ్య లోపలికి పోయి గ్లాసుతో నీళ్లు తీసుకొచ్చి రూపాయిమీద చల్లి దాన్ని తీసి అటూయిటూ త్రిప్పి మోగించి లోపలికెళ్లాడు— మరునిముషంలో మందు పొట్లం వెంకడిచేతులో పడ్డది—

౨

ఇంటికి పరుగెత్తాడు వెంకడు. అప్పటికి నడినెత్తిమీద కొచ్చాడు సూర్యుడు. అన్నివైపులకీ సమానంగానే— ఒకే వేడితో పడుతున్నాయి కిరణాలు—దార్లో కంసాలి వీరాచారి గుమ్మంముందర గోతిలో పడ్డాడు. చేతులో పొట్లం దుమ్ములో పడిపోయింది. లేచి— చిరిగిపోయిన పంచె పీలికను మొల్లో దోపి పొట్లం దుమ్ముదులిపి— కొట్టుకుపోయిన మోచేతులూ, కాళ్లు కూడా చూసుకోకుండా మళ్లీ పరుగు ప్రారంభించాడు—

గూడెం కనిపిస్తోంది.

ఎదురుగా వీరయ్యమామొస్తున్నాడు— ఏదో అన్నాడు—

వినిపిస్తేనా?— వీరయ్య పట్టుకోబోయాడు— విడిపించుకుని ఆగకుండా రొజుతూ— పరుగు పెడ్తూనే వున్నాడు— వెంకడు.

ఇంటిముందు యీరయ్యమామ పెళ్లాం, మరదలు నిలబడివున్నారు. పెద్దపిల్లా డూరికే ఏడుస్తున్నాడు. పిల్లని వీరయ్యపెళ్లాం ఎత్తుకునుంది. చంటాడ్ని మరదలు బుజ్జగిస్తోంది. చంకలోంచి జారిపోతున్నాడు వాడు. వెంకడ్ని చూడగానే అంతా గొల్లుమన్నారు. వెనకాలే పరుగెత్తుకొచ్చిన వీరయ్య 'పాపం!' అంటున్నాడు.

గుమ్మందగ్గరే రత్తి శరీరం. మొహంమీద గుడ్డ తీస్తాడు వెంకడు.

'రత్తీ!' అని అరిచాడు వెంకడు. గుమ్మంప్రక్కని పడిపోయాడు. చేతులో మందుపొట్లం వెళ్లి ఎండిపోయిన గంజిగుంటలో పడింది—

కొట్టుకుపోయిన వెంకడి మోచేతినుండి రక్తబిందువు చెదరి రత్తి పెదిమలమీద పడింది.

కసాయి జగమ్ము

౧

ఈ కసాయి జగమ్ము
నెట్లు సృష్టించితివి?
ఇంత మతిలేదేల దేవా!

కలుషు మెరుగని స్వర్గ
కల్యాణ సీమలో
కాపురమునీ కేల? దేవా!

౨

సాధుజీవాల వె
చ్చని రక్తమాంసాలు
తిను వ్యాఘ్రలోక మిది దేవా!

పులికోరలకు దివ్య
పుష్పజీవాలేల
పీనుగుల్పాలవా! దేవా!

౩

హృదయ మెరుగని శిలా
ప్రతిమలను ప్రేమించు
పాషాణలోక మిది దేవా!

కఠినపాషాణాలు
కరుగునా పాటలకు
కాలాగ్ని కేగాని దేవా!

౪

ఆశాపిశాచ ఘో
రకరాళదంష్ట్రాగ్ర
గళితకంకాళమిది దేవా!

జీవ తేజస్సృష్టి
జేసిరక్షింతువా?
భస్మమ్ముజేతువా? దేవా!

—సాధకుడు.

‘మీ మంచిపేరు ఉపయోగించి నేను కోటిరూపాయిలార్జిస్తాను.

పెద్దమనిషితరహా

………ఆకృతినిబట్టి గుణాగుణంబులన్
గ్రమముగ నిర్ణయించుట దురాసదమౌగద నెట్టివారికిన్.

—చిలకమర్తికవి.

‘ మనుజుండై పశువౌటకంటె పశుజన్మంబెచ్చు ’

—వసురాయడు.

ప్రతి మనిషి లోకవ్యవహారములో అందరిచేత పెద్దమనిషి అని అనిపించుకొనవలెననే వుద్దేశమును కలిగివుంటాడు. ఆలాటి వుద్దేశము లేనివారు అసలే లేరని కాదు నామనివి. అట్టి వారు చాలా అరుదు. పెద్దమనిషితరహాకు వ్యతిరేకమున్న, ప్రతిబంధకమున్న అయిన పనులను చేసేవా రెందరో వున్నారు. కాని వారాపనులను బహిరంగంగా చేయడమునకు జంకుతారు ; జంకి రహస్యంలోమాత్రం చేసి తమ ఆశను చాపల్యమును సంతృప్తి పరుచుకుంటారు. చేదు మందును పంచదారలో మెదిపినట్లుగా వీరు తమ బహుజననిరసితమగు కార్యాలను మభ్యపెట్టి చేసుకుంటారు.

పెద్దమనిషి అనే శబ్దార్థాన కుండవలసినవి పన్నెండు లక్షణములున్నాయని పలేమహర్షి (St. Palaye) వచించాడు. విశ్వాసము, వదాన్యత, న్యాయదృష్టి, ఇంగితజ్ఞానము, వివేకము, మితత్వము, దృఢత్వము, సత్యము, లేదనకిచ్చుట, కష్టించి పనిచేయుట, శౌర్యము, ఆశ అనునవి ఆ పన్నెండు గుణములున్న. సహనమును, ఇతరుల మనోభావములను లెక్కసేయుట అనునవి గూడ వీనికి చేర్చుట సమంజసముగా తోస్తున్నది.

ఈలాటి లక్షణములు గలిగిన గీటురాయతో పెద్దమనుష్యుల వన్నెను నిర్ణయింప పూనితే కోటానుకోట్లుగా వున్న యీనాటి నాగరిక పుత్రులలో ఎందరు తేలుదురో తెలియదు. మహాత్మా గాంధీ గీటాగుతాడేమో!

అయితే ఆలాటి వారు లేరా అనవచ్చు. లేరని యేలా అనడము? చాలా అరుదు అనవచ్చు. చూచినంతమాత్రాన మనిషియొక్క లక్షణము తెలియదు. కొందరిని ప్రథమదర్శనమాత్రాన మనము ప్రేమించుదుము. వారి ఆకృతి అంత ఆకర్షణీయము. కాని వారి అంతరంగము చూస్తే పయోముఖ విషకుంభము వంటిదవుతుంది. కనుకనే ‘ఆకృతిని బట్టి గుణాగుణంబలన్ గ్రమముగ నిర్ణయించుట దురాసదమౌ గద నెట్టివారికిన్ ?’ అని చిలకమర్తికవి అన్నాడు. సొగసైన నడవడి, సొగసైన ఆకారము కన్న మిన్న.

ఆంద్రోకలీసు అడవిలో తిరుగునాడు తనకాలిలో ముల్లు నూడదీసి బాధోపశాంతి చేసినాడనే విశ్వాసాన్ని ఆ సింహము మరవలేదు. మనము వినయంగా వంగివంగి సలాములు చేసే ఎంతమంది పెద్దమనుష్యులను ఈసింహం పెద్దమనిషితరహాలో తలదన్నిందో మీరూహించండి? జన్మతో ఏమున్నది ? చతుష్పాత్తూ, క్రూరమృగమూ అయితే ఏమి ?

‘మనుజుండై పశు వౌటకంటె పశుజన్మం బెచ్చు’ అన్నాడు మృతజీవి వసురాయడు.

పెద్దమనిషి తరహా అనే బురఖా తగిలించుకుని తమస్వార్థాన్ని పెంపొందించుకునే కుహనాగౌరవనీయులు ఈరోజులలో హెచ్చుగా వున్నారు. కాని ఈయిమిటేషను వస్తువులను మనం సులభంగా గుర్తించగలం. “మీ మంచిపేరు నాకు ఇస్తే మీకు లక్షరూపాయిలిస్తానండి” అని ఒక డన్నాడు. “ఎందుకు?” అని ఆపెద్దమనిషి ఆశ్చర్యంతో అన్నాడు. “ఆపేరు

వుపయోగించుకొని నేను కోటిరూపాయి లార్జించగలను'' అని ఆ వంచకుడు బదులుచెప్పాడు. కనుక మారుబేరగాళ్ళను పోలిన ఈ దొంగపెద్దమనుష్యులను మనము గుర్తించలేకపోతే మోసం వుంది.

పెద్దమనిషితరహా అనేది ఏలాటి పరిస్థితులలో అయినా గీటుకు ఆగుతుంది. ఇది రాజ్యాభిషిక్తుడుగానున్న రాముని గాని, భార్యను అమ్మనున్న హరిశ్చంద్రుని గాని, పసుపుబట్టలతో ప్రాణ మీయవలసివచ్చిన జీమూతవాహనుని గాని, మేనికండలు కోసికొనవలసిన శిబిని గాని మోహపెట్ట లేకపోయినది. అంతదూరము పోనవసరం లేదు. నే (Ney) అను నతడు నెపోలియనువద్ద సైన్యాధికారి. అతడు సర్ చార్లెసు నేపియరును యుద్ధంలో క్షతగాత్రుణ్ణి చేసి చెరబట్టాడు. నేపియరుకు వృద్ధురాలు, అంధురాలు అయిన తల్లి వుంది. కుమారునిపత్తా ఆమెకు తెలియక అడలిపోతూంది. బ్రిటిషుగవర్నమెంటు వారు ప్రత్యేకం ఒకనిని నేపియరు యోగక్షేమం తెలిసికొనుటకు ఫ్రాన్సు పంపించారు. అతడు నే సేనానిని కలిసినాడు. ''ఆసందేశహరుని నేపియరు చూడవచ్చు. అతడు సుఖంగా వున్నాడు; ఉచితమర్యాదలు జరుగుతున్నాయి'' అని నే అన్నాడు. కాని సందేశహరుడు కొంచెము ముందువెనుక లాడాడు. అది చూచి 'అతని కేమి కావలెను?' అని నే అన్నాడు. 'నేపియరుకు అంధురాలు, వృద్ధురాలు, విగతభర్తృక అయిన తల్లి వున్నది' అని అన్నాడు. 'అలాగా! అయితే అతన్నే పొమ్మని తాను సజీవంగా వున్నానని ఆమెతో చెప్పకొమ్మను' అని నే అంటూ నేపియరును విడిచిపుచ్చాడు. నెపోలియను ఏమంటాడో అనికూడా అతను సంకోచింపలేదు.

చంప తగిన యట్టి శత్రుండు తనచేత
చిక్క నేని కీడు చేయకుండ
పొసగ మేలుచేసి పొమ్మనుట

ఎంతటి భాగ్యశాలికి అబ్బును?

జీవితయాత్ర నంతను ఒక వీర కథాఘట్టముగా నడుపుకొన్న పూర్వీకులసొమ్ము ఈలాటి త్యాగసాహసము.

విలియం గ్రాంటు, ఛార్లెసు గ్రాంటు లిద్దరుండేవారు. నిరుపేద కుటుంబంలో పుట్టి స్వశక్తివల్ల పైకి వచ్చి ధనికులు, దాతలు అయినారు. వారి అదృష్టము చూచి ఓర్వలేని ఓడవర్తకు డొకడు వారి మీద నిందాపూరితమైన వ్యాసమును వ్రాసి ప్రకటించాడు. అది గ్రాంటుసోదరులకు చూపగా 'అతడే పశ్చాత్తాప పడును' అని పూరుకున్నారు. ఎందరు చెప్పినా అతని మీద చర్య తీసుకోలేదు. కొన్నాళ్లకు ఆవర్తకుడు దివాళాతీశాడు. అపు డతనికి గ్రాంటుసోదరుల సాయము అవసరమైనది. అది తెలియగానే వారు అతని దుష్టవర్తనమునైనా స్మరింపకుండా కావలసిన వాక్సహాయాన్ని, ధనసహాయాన్ని కూడా చేసేసరికి అతడు పశ్చాత్తాపుడై పసివానివలె దుఃఖించాడు.

పెద్దమనిషితరహా అనే గుణం ఒకదీపము వంటిది. ఇది తాను ప్రకాశించుటే గాక ఇతరులను కూడా ప్రకాసింప జేస్తుంది. ఒకదీపానికి ముట్టించి అనేకదీపాలను వెలిగింపవచ్చు. కాని ఆమొదటిదీపపు కాంతికి ఏమాత్రమూ కొరతరాదు. ఆలాగే పెద్దమనిషివిషయమున్నూ.

ఆరోగ్యవిజ్ఞానము

అనాసపండురసం ఏటికపాముల్ని చంపుతుంది

కొందరికి పేగులలో ఏటికపాములు చేరుతూవుండడ మనే జబ్బు వుంటుంది. అతిమధురపదార్థసేవన వల్ల, మనం తిను కూరగాయలద్వారా క్రిములు లోపలికి చేరుట వల్ల ఈజబ్బు కలుగుతుంది.

ఈజబ్బుకు అనేకవిధములైన మందులు వున్నాయి. కాని అవి కొద్దో, గొప్పో ఖరీదు గలవి. ఈజబ్బుకు మిక్కిలి చవకభారులో ఒకమందు కనిపెడదామని విస్‌కాన్‌సిన్ విశ్వవిద్యాలయపు శాస్త్రవేత్తలు జాలియస్ బెర్జర్, కాన్‌రడో క్రైడికో అనే ఆసామీలు పరిశోధనలు సాగించారు.

ఆపరిశోధనలో మనదేశంలో ఈజబ్బుకి అనాసపళ్లరసం ఉపయోగించడం వారు తెలుసుకున్నారు. తెలుసుకుని వారు అనాసపండుపచ్చిరసంలో ఏటికపాముల్ని కొన్నిటిని వేశారు. అవి వెంటనే గింజుకుని చనిపోయాయి.

ఇంకా పరిశోధించి వారు అనాసపండురసానికి ఈక్రిమిసంహారకశక్తి అది పచ్చిగా వున్నప్పుడే వుంటుంది కాని వెచ్చబెట్టినా, ఎండబెట్టినా పోతుందని కనుగొన్నారు.

... ...

అరటిపండులో పుష్టినిచ్చేపదార్థాలు.

అరటిపండులో నాలుగింట మూడు వంతులు ఆర్ద్రపదార్థం వుంది. మిగతా ఒకవంతులోనూ శరీరానికి పుష్టికలిగించే పదార్థాలు వున్నాయి.

అందులో ఐదింట నాలుగువంతులు ఫలసంబంధమైన పంచదార (దీనినే ఆంగ్లభాషలో గ్లూకోస్ అంటారు.) వుంది. ఈఫలశర్కర అతిసులభంగా జీర్ణమవుతుంది. ప్రతిదినమూ శరీరములో వెచ్చమైపోయే పదార్థాలని అది భర్తీచేస్తుంది.

బాగా పండిన అరటిపండులో ఫలశర్కర దాని సహజస్వరూపంలో వుంటుంది. శరీరపోషణకు అత్యంతావసరమైన ప్రొటీన్ కూడా ఇందులో జాస్తీగా వుంది. కొద్దిగా కొవ్వుపదార్థము; పిండిపదార్థము వుంది. సూక్ష్మంగా బూడిదపాలుకూడా వుంది. ఈబూడిదలోనే లోహసంబంధమైన లవణాలు పదకొండు విధాలయినవి వున్నాయి.

... ...

ఎపండిసైటిస్ వ్యాధికి జలగలవల్ల చికిత్స

ఆయుర్వేదగురువు ధన్వంతరి ఒకచేతిలో కరక్కాయతోటి, ఒకచేతిలో జెలగతోటి పుట్టాడనే ఐతిహ్యం ఒకటి వుంది.

రోగుల శరీరాన్నుండి రక్తమోక్షం చేయడానికి కొన్నిజబ్బుల్లో జలగల్ని ఉపయోగించడం మనఆయుర్వేదవైద్యంలో చిరకాలప్రసిద్ధమైన ఆచారం. అయితే ఆఆచారం ఇటీవల పూర్తిగా విడనాడబడింది.

ప్రస్తుతం అమెరికాలోని జర్మన్ శాస్త్రవేత్త ఒకడు ఎపండిసైటిస్ వ్యాధికి జెలగల్ని ఉపయోగించి కృతకృత్యుడు అయాడని తెలియవస్తూవుంది. ఎపండిసైటిస్ అనే వ్యాధికి ప్రస్తుతం శస్త్రచికిత్స తప్ప మరిఒక చికిత్స లేదు. కొన్ని సంవత్సరాలకు పూర్వం మహాత్మునికి ఎపండిసైటిస్‌వ్యాధి రావడం, ఆసందర్భంలో ఆపరేషన్ చేస్తూవుండగా ఎలక్ట్రిక్ దీపాలు ఆరిపోవడం, అప్పుడు హరికేన్ లాంతరు వెలుగులోనే ఆఆపరేషన్ సాగడం పలువురికి జ్ఞాపకం వుండవచ్చు. ఎపండిసైటిస్ ఆపరేషన్ మేజరుఆపరేషన్‌లలో ఒకటి.

అట్టి వ్యాధికి శస్త్రచికిత్స అవసరం లేకుండా జెలగల సాయంతోనే వ్యాధి నివారణచేయగలగడం మానవలోకానికి మహోపకారమే.

పైన పేర్కొనబడిన జర్మన్‌శాస్త్రవేత్త పదహారు ఎపండిసైటిస్‌కేసులలో జెలగల్ని వాడి చికిత్సచేశాడు.

ఉదరానికి కుడిపక్కను ఎనిమిది లేక పది జెలగల్ని పొదగడం. ఇదే చికిత్స. ఈవిధానం వల్ల వెనువెంటనే గుణం కనిపించింది. కాగా ఆపరేషన్ మానివేశారు. క్రమంగా రోగు లందరూ రోగవిముక్తు లయ్యారు.

"మీరా ఈ రాజ్యాన్ని వదలిపోవాలి. శ్రీకృష్ణుడు ఈ ప్రపంచంనుండి పారిపోవాలి." భీషణ సమస్యే. శివుని ప్రతిష్ఠను, శక్తిని, కాపాడాల్సిన భారం అంతా తన వక్కనిమీదనే ఉందని రాజగురు నమ్మకం. పరదేవునకు పూజా సత్కారాలు తన ఎదుట జరగటం. తన దేవుని అవమానించటమేనని అతని అభిప్రాయం.

ఈ అవమానాన్ని సహించననీ, ఇక మీద అలా జరిగితే, ప్రాణత్యాగం చేస్తాననీ ప్రతిజ్ఞచేస్తాడు. అయినా కృష్ణపూజ జరుగుతునే ఉంటుంది. కృష్ణమతం దేశంఅంతటా పాకుతూఉంటుంది.

భరించలేకపోయా డవమానం. ప్రాణత్యాగానికి సిద్ధమైనాడు. భవానీఎదుట నిలబడ్డాడు. 'భవానీ ఈదేశంనుంచి ఈ కృష్ణభూతాన్ని వెళ్లగొడతావా— నా కంఠం కత్తిరించుకోమంటావా' అని గండకత్తెర్లో తల ఇరికించి స్తోత్రం మొదలెట్టాడు ఏదేకదీక్షతో.

ఏమయింది? భవానీ కృష్ణుణ్ణి వెళ్లగొట్టిందా? రాజగురు కంఠాన్ని కత్తిరించిందా? ఇది నవ్యకళాఫిలిమ్స్‌వారు షూట్ చేస్తున్న మీరాబాయిలోని ఒక సీను.

రాజగురుగా నటిస్తున్న డా॥ సుబ్బారావుగారు అతిశ్రద్ధతో ఈపాత్రను పోషిస్తున్నారు. సెట్టింగ్ అచ్చ రసపుత్రపు ఆలయంలాగానే వేయించారు. చిన్నది మొదలు పెద్ద పరికరాలవరకు చాలా శ్రద్ధగా సేకరిస్తున్నారు.

ఈ చిత్రం సర్వవిధాలా ఉత్తమోత్తంగా ఉండాలని డైరక్టరు నరసింహారావుగారి సంకల్పం.

... ...

ఇరువురి జీవితంలోనూ అత్యంత ఆనందదాయకము కోవలసినరాత్రి అది. ఇరువురి హృదయాలలోనూ ప్రేమవాహిని పొంగి పొరలిపోతున్నది. సంగమస్థానం కొరకు అత్యంతాతురతతో, అతి సుందరంగా అలంకరింపబడిన శయ్యామందిరంలో రాణా అటూ ఇటూ పచారు చేస్తున్నాడు. మధ్యమధ్య ఆశానేత్రాలతో ద్వారం వంక చూస్తూ నిరాశతో నిట్టూర్పులు విడుస్తున్నాడు. క్షణంయుగంగా కనపడుతున్నది. గంటలు గడిచిపోతున్నవి. భరించలేకపోయాడు ఆ అంతులేని నిరీక్షణావస్థను.

రెండుకొట్టింది కోట గడియారం. నియమిత వేళకూడా దాటింది. మనోభీష్టము నేరవేరలేదు. అలసట... పైన ఆశాభంగము. విశ్రమిద్దామని శయ్యపై వొత్తిగిల్లిన రాణా...అప్రయత్నంగా నిద్రావస్థలో పడిపోయాడు.

సినిమా

ప్రేయసి ఆగమనానంతరం పొందగల సౌఖ్యాన్ని, ఆనందాన్ని, కళ్లుమూసుకు పోయినవి.

ఎవరి కొరకింతగా వేచి, వేసారి, విఫలమనోరథుడైనాడు రాణా?

మీరా పూజామందిరంలో ప్రపంచాన్నంతా మరచి, తన్మయత్వం చెంది భగవదారాధనలో నిమగ్నురాలై తనకొరకు నిరీక్షిస్తున్న నాధునిసైతము మరచి, భక్తిపారవశ్యంలో మునిగి తేలుతూ ఉంది. ఆమెకు గంటలు తెలియలేదు... స్మృతిపథంలోఉంది ఒక్కటే...కృష్ణ భగవానుని సేవ. కన్పించుచున్నది ఒక్కటే...శ్రీకృష్ణుడు.

మూడుగంటలు కొట్టినది గడియారం!

౧

బందావారిలో వుండే
స్త్రైణభావాలూ—
హరిణ వీక్షణాలూ
—కన్నాంబకూ—
కన్నాంబలోవుండే
పౌరుషప్రతాపాలు
బందావారికీ
బదలాయింపులయితే
తెలుగు ఫిల్ముల్లో.
మజా—
తేజరిల్లుతుంది.

[సినీమా పబ్లిసిటీలో అప్పటప్పటి
రపరంపరాసిద్ధమైనవిషయం. అనేకవిష
తెనుగు సినీమాకంపెనీలు చాల వెనుకబ
నీల బుల్లెటిన్‌లు కర్త కర్మ క్రియలులేక
వుంటున్నవి. మరి కొన్ని తెనుగు సినీమా
ల్లో ఇంగ్లీషుభాషలో పుట్టి తెనుగుపత్రిక
తున్నాయి ఈదోషానికి దూరమైన బు
నీలు నోచుకోలేదనే చెప్పవచ్చు. ఇప్పు
ఫిలుమ్సువారి 'మీరాబాయి' బుల్లెటిన్
స్తూవుంది. ఈబుల్లెటిన్‌ల భాషలో సిద్ధక
వెలువడ్డ ఆకంపెనీవారి బుల్లెటిన్‌లు పాతక

...ష యాలు

మీరా మేల్కొంచినది. తన భౌతిక నాథునివైపుకు పరువెత్తింది హృదయం. ఆమెకూడా అనుసరించింది...నాథుడు మైమరచి నిదిరించుచున్నాడు...

ప్రియుని పాదాలసేవించ నారంభించింది. జగము కన్నులు తెరచినది. రాణా లేచాడు. రెప్పవాల్చక...భక్తి. అనురాగములలో పాదాలవొత్తుచున్న ప్రేయసిని చూచాడు. ముగ్ధుడైనాడు. విశ్రమింపమని చెపుతూ మీరాను తోడ్కొని ఆమె మందిరంవైపు నడిచాడు.

నవ్యకళాఫీలుమ్సువారి "మీరాబాయ్"లోని ఈ ప్రధానఘట్టమును శ్రీ భీమవరపు నరసింహారావుగారి దర్శకత్వం

...బుల్లెటిన్ లు విడుదలచేస్తూరావడము ఆచా...ర్లోవలెనే ఈవిషయంలోకూడా మన ...ప్రంటున్నవి. కొన్ని తెనుగుసినీమా కంపె... అన్వయముకాని తెలుగు వాక్యాలతో ...ంపెనీల బుల్లెటిన్ లు కంపెనీ కార్యాలయా... కార్యాలయాల్లో అనువాదకర్మను పొందు...క్షిన్ లకు ఇంతవరకు తెనుగు సినీమాకంపె... తెనుగులో తీయబడుతూవున్న నవ్యకళా...లోమాత్రం కొంతనవ్యత, రమ్యత కనిపి...ప్తము తరలిస్తూవుంది. ఫిబ్రవరిమాసంలో పరిశీలనార్థం ఇక్కడ ప్రచురిస్తున్నాము.

—సంపాదకుడు.]

క్రింద యం. పి. పి. సి స్టూడియోస్ లో నవ్యకళాఫిలిమ్స్‌వారు షూటింగ్ జరిపారు.

... ...

రకరకాల రంగులు. రంగులపూలతో రమణీయంగా అలంకరింపబడిఉన్నది మందిరము. ఎటుచూచినా ప్రాచీన భారతీయకళ ఉట్టిపడుతూవుంది. ఒకమూల మంగళవాద్యములు..... మరొకప్రక్కన మేలి ముసుగులలో మగువలు...అంకటా క్షత్రియ వీరులు బారులుతీర్చి కూర్చున్నారు. అందరిదృష్టి ఆవధూవరులమీదనే... వరుని దృష్టి వధువుమీదనే...మరి వధువు దృష్టి? ......

ప్రభువు పాణిగ్రహణ మహోత్సవాన్ని ప్రజలు...కోలాహలముగా జరుపుతున్నారు. తను కోరుకొన్న, మనసారా ప్రేమించిన పడతి లభించినందుకు ప్రభువు ఆనందతరంగములపై తేలియాడుతూ ఉన్నాడు...

పురోహితులు ఏకధారగా మంత్రపఠనము గావిస్తున్నారు. రాజుగారి—అందునూ రాజపుత్రుడు...వివాహవైభవము...చూచి ఆనందింపనివారెవరుంటారు?

అన్నగారి వివాహం...ఆ భార్యాభర్తలు వివాహ మంటపంపై కూర్చున్నపుడు ఉమా చూచి పొందిన సంతోషం ఆమెలోని యవ్వనపుజ్వాలలను ప్రజ్వలింపచేసినవా?

తన ప్రియుని...చెంతన అలానే కూర్చొని...అందరి ఆశీర్వచనముల పొంది...సుఖపడగల రోజు ఎప్పుడాఅని... ఆలోచిస్తూవుండెను.

కాదు...వచ్చు...అప్పుడే వికసించినది......ఆనందనోద్యానవనమునందు అమందానందభరితయై ప్రియునిరాకకై, అతనితో ఆ ప్రకృతిరామణీయకతలో మైమరచి సుఖింపగల తరుణముకొరకు ఎదురు చూస్తున్నది—రాణా సోదరి ఉమ. గుప్యాపావురము లొకచోట చేరినవి...కొమ్మ, కొమ్మకు తిరిగినవి. కొలనుగట్టున చేరి... ఇతర ప్రపంచాన్నంతా మరచి...నిర్విచారంగా నిర్మల నీలాకాశముక్రింద కాలము గడపుతున్నారు...

"మీరాబాయ్" లోని, ఈరెండు దృశ్యముల షూటింగ్ శ్రీ భీమవరపు నరసింహారావుగారి దర్శకత్వమున జరిగినది. చిత్రము సగానికిపైగా పూర్తి అయినది. కళనే ప్రధానముగా పెట్టుకొన్నా శ్రీ నరసింహారావుగారు అందులకై అనవసరమైన ఖర్చునుగాని, కాలయాపనగాని, రానివ్వక శరవేగముతో చిత్రాన్ని పూర్తిచేస్తున్నారు.

౨

అద్దంకి
గానమాధుర్యంలో కొంత
కాంచనానికి—
కాంచనమాల
కళాకాంతుల్లో కొన్నివన్నెలు
అద్దంకికీ
అదృష్టుచేసే
దేవుడుంటే—
ఆంధ్రాఫిల్ముపరల్డు
అదృష్టం పండుతుంది.

మహారాష్ట్రులుకూడా మన శాలివాహనశకాన్నే వాడుతారు.

మహారాష్ట్రుల ఉగాది

ఆంధ్రుడైన వల్లభాచార్యుడు గుజరాతులోనూ, ఆంధ్రుడైన పండితరాయలు మాళవదేశంలోనూ గౌరవింపబడుతూ వున్నట్లే ఆంధ్రుడైన శాలివాహనుడు మహారాష్ట్రదేశంలో గౌరవింపబడుతూవున్నాడు.

మనలాగే మహారాష్ట్రులుకూడా శాలివాహనశకాన్నే అవలంబిస్తారు. చైత్రమాసాదిదినమే వారి శాలివాహనశకసంవత్సరానికిన్నీ ఆదిదినము.

మహారాష్ట్రులు ఉగాది దినాన్ని 'గుడిపద్వా' పర్వమనీ, ధ్వజారోపణపర్వమనీ అంటారు. ఆనాడు మహారాష్ట్రులు తమ ఇంటిముందు ఒక ధ్వజాన్ని నెలకొల్పుతారు. దానిమీద వెండిదికాని, రాగిదికాని, ఇత్తడిదికాని పాత్రను ఉంచుతారు. బంగారు జరీపోగులుగల పట్టు పీతాంబరాన్ని ఆధ్వజానికి చుట్టబెడతారు. ఆధ్వజానికి కొన్ని జెండాలుకూడా కడతారు. కొత్తగా ఇల్లుకట్టడానికి కాని, ఏదైనా కొత్తపనిని ప్రారంభించడానికికాని అది చాలా శుభదినమని మహారాష్ట్రుల నమ్మిక. ఇంద్రలోకంలో ఇంద్రుడు ఈనాడు ఇట్టి ధ్వజస్తంభాలని నెలకొల్పుతాడనీ, తాము నెలకొల్పే ఈ ధ్వజాలు వాటికి అనుకరణాలనీ మహారాష్ట్రుల విశ్వాసం.

మనం ఉగాదినాడు వేపపువ్వు తింటాముకదా. మహారాష్ట్రులు వేపాకు తింటారు. (Bitter Nim tree : Malia Azadirachta). స్వర్గలోకంలోవుండే అమృత(Amorosie) వృక్షానికి జనితమై వేపచెట్టు భూలోకంలో పుట్టింది కాబట్టి ఈనాడు వేపాకులు తినడం మంచి ఆరోగ్యప్రదమని మహారాష్ట్రులు నమ్ముతారు.

కొత్తపంచాంగాల్ను కొని, వానిని పూజిస్తారు. సంవత్సరఫలాల్నిగురించి సిద్ధాంతులతో సంప్రదిస్తారు.

నాటి ఉదయాన్ని స్త్రీలు తమ ఇంటిముంగిళ్ళయందు పేన్నీళ్లుచల్లి ముగ్గులు పెడతారు. ఆ ముగ్గుల మీద మధ్యను చౌరంగం అనే కర్రపీట వుంచుతారు. ఆపీటమధ్యను నీళ్ళలో నింపిన పాత్రను నెలకొల్పుతారు. ఆపాత్రలో ఒక రూపాయి వేస్తారు. ఆపాత్రమీద ఒక టెంకాయ నిలుపుతారు. పూజ చేస్తారు. అనంతరం మధురమైన భక్ష్యాలు భుజిస్తారు.

శాలివాహనశకనిర్మాతను గురించి మహారాష్ట్రులు చెప్పుకునే గాధ ఈసందర్భంలో వినతగిందిగా వుంటుంది :

పురంధరపురంలో ఒక వర్తకుడు. అతడు చాలా ధనవంతుడు. అతనికి నలుగురు కొడుకులు. చనిపోయేముందు అతడు తన కొడుకులకు నాలుగు నీళ్లువేసిన పాత్రలు ఇచ్చాడు. తాను చనిపోయేవరకు ఆనీళ్లు తెరవవద్దని అతడు కొడుకులికి ఆదేశించాడు.

అట్లే ఆనలుగురు కొడుకులూ తండ్రి మరణానంతరం ఆపాత్రల నీళ్ళు తొలగించి చూచారు. మొదటిపాత్రలో మట్టి- రెండవదానిలో బొగ్గులు- మూడవదానిలో, ఎముకలు, నాలగవదానిలో తవుడు వున్నాయి. దీనిఅర్థం వారికి తెలిసింది కాదు.

ఆనాటి హైందవచక్రవర్తి విక్రమార్కుడు. ఆ సెట్టికొడుకులు నలుగురూ దాని అర్థాన్ని బోధింపవలసిందిగా విక్రమార్కుని కోరారు. కాని విక్రమార్కునికి కూడా దాని అంతరార్థం అవగాహనకాలేదు.

అప్పుడు వారు ప్రతిష్ఠానపురానికి వెళ్ళారు. అక్కడకూడా రాజుకాని, మరి ఎవ్వరుకాని దాని అంతరార్థాన్ని తేల్చలేక పోయారు. కాని ఆపూరిలోని వింతబాలుడు ఒకడు ఆసమస్యను విడమర్చి చెప్పాడు.

ఆ వింతబాలుడు ఒక బ్రాహ్మణవితంతువుకొడుకు. ఆబ్రాహ్మణస్త్రీ మిక్కిలి చిన్నతనములోనే భర్తను పోగొట్టుకుంది. ఆమెకు ఇద్దరు సోదరులు. నాగకుమారుడైన తక్షకునివలన ఆమెగర్భం ధరించింది. ఇందుకు ఆమె సోదరులు చిన్నబుచ్చుకుని దేశాంతరగతులై పోయారు,

దిక్కులేని ఆదీనవితంతువుకి అప్పుడు ఒక కుమ్మరివాడు ఆశ్రయమిచ్చాడు. ఆకుమ్మరి యింటిలో ఆమె ఒకకుమారుణ్ణి ప్రసవించింది. కుమారునికి తల్లి శాలివాహనుడు అని పేరుపెట్టింది. అతడు క్రమంగా పెరిగి పెద్దవాడు అవుతూవుండెను.

అట్టివాడు వర్తకుని నాలుగు పాత్రల సమస్యనువిని దానిని తాను పరిష్కరిస్తానని రాజువద్దకు వెళ్ళి ఇట్లా చెప్పాడు : మట్టితో నిండిన పాత్రవచ్చిన కుమారుడు భూమినీ- బొగ్గుతో నిండిన పాత్రను పొందిన పుత్రుడు కలపనూ- ఎముకలతో నిండిన పాత్రను పడసిన తనయుడు ఏనుగులు, గుర్రాలు, పశువులు మొదలయిన జంతువుల్నీ- తవుడుతో నిండిన పాత్రవచ్చిన సుతుడు ధాన్యాల్నీ పంచుకోవాలని వర్తకుని తాత్పర్యమని శాలివాహనుడు చెప్పాడు.

శాలివాహనుడు ఇంత సముచితంగా ఈ సమస్యను పరిష్కరించిన సంగతి విని విక్రమార్కుడు

అతన్ని చూడ్డానికి కుతూహలపడి కబురుచేశాడు. విక్రమార్కుని అంతటివాడు కబురుచేసినా శాలివాహనుడు పోలేదు. నేను పోయేదిలేదని చెప్పివేశాడు. పైగా విక్రమార్కుడే తన దర్శనానికి వచ్చే రోజు వస్తుందని కూడా చెప్పాడు.

దీనికి విక్రమార్కుడికి కోపం వచ్చింది. శాలివాహనున్ని మట్టుపెట్టడానికి అపారబలసమేతుడై ఎత్తివచ్చాడు. ఇది విని శాలివాహనుడు మట్టితో మనిషిబొమ్మలు చేసి వాటికి ప్రాణంపోసి విక్రమార్కుని సేనలమీదికి పంపాడు. పోరు ఘోరమైసాగింది.

శాలివాహనుడు సమ్మోహనాస్త్రం ప్రయోగించి విక్రముని సేనల్ని నిద్రపోయేటట్లు చేశాడు. అప్పుడు విక్రముడు వాసుకి అనే నాగరాజును ప్రార్థించి విరుగుడు మందు తెప్పించుకొని తన సేనల్ని తిరిగి తేర్చుకున్నాడు. అప్పుడు ఉభయులకూ రాజీ జరిగింది.

మరోకథ ప్రకారం యుద్ధసమయంలో ఆకాశవాణి ఆ ఇద్దరు రాజుల్నీ ఉద్దేశించి నర్మదానదికి ఉత్తరాన్ని విక్రమార్కుని, దక్షిణాన్ని శాలివాహనున్ని రాజ్యం చేయమని తీర్పుచెప్పి యుద్ధాన్ని మానిపించిందని తెలియవస్తూవుంది.

శాలివాహనుడు శకస్థాపకుడు ఐనాడు.

ఆంధ్రరాష్ట్రం అక్కరలేదనే ఆంధ్రులుకూడా ఈకాలంలో ఉన్నారు

రాయలసీమ అఘోష

"ఇది ఆంధ్రరాష్ట్ర విభజనవల్ల కష్టనష్టాలకు గురి అయ్యే ఆంధ్రేతర సోదరులు గరపి పుచ్చిన కుతంత్రవాదం కాని తెలుగువాడైన వాడి తలలోబుట్టే తలపులేనా ?"

రచయిత :

కోరకొండ సత్యనారాయణ, బియే.,బి.ఎల్.

ఆంధ్రరాష్ట్రమో, ఆంధ్రరాష్ట్రమో అని ఆంధ్రుడై పుట్టిన ప్రతివ్యక్తి అల్లాడుతూ ఉంటే అదే ఆంధ్రదేశంలో, అక్కడక్కడ ఆంధ్రరాష్ట్రవిభజన అక్కరలేదనే వితండవాదాలు గూడా వినబడుతూ ఉన్నయి. స్వరాజ్యం అక్కరలేదనే భారతీయులు లేరా? అదే ఫక్కి! అదే తంత్రం!

భరతదేశ భావిభాగ్యోదయ సమస్యలో శ్వైటుహాలుప్రభువులు పతిస్తున్న మిత్రభేదమంత్రాన్నే, చెన్నరాజధాని శాసనకర్తలు కూడా ఆంధ్రరాష్ట్రసమస్యలో ప్రయోగిస్తున్నారు. తరతరాలనాటి వారిసాహచర్యం వూరికే పోతుందా?

ఈ అక్కరలేదనే అడ్డుమాటలు ఏనాడులో, ఏ సీమలో బయలుదేరుచున్నవో విన్నారా?

ఏ నేలలో కాకతీయసామ్రాజ్యశిథిలశల్యాలపై విద్యారణ్యమహాశయులు తృతీయాంధ్రసామ్రాజ్యానికి పునాదులు వేశారో; ఏ సీమలో మహామాత్యులు చిట్టిగంగన, తిమ్మరాజు లా పునాదులపై సుస్నిగ్ధసుందర సామ్రాజ్యసౌధాన్ని నిర్మించారో; ఏభూమిని ఆంధ్రరాయలు ఖడ్గహస్తుడై, కావ్యహస్తుడై కటకకన్యాకుమారీల మధ్యప్రదేశాన్ని పాలించాడో; ఏనాట అష్టదిగ్గజము లాంధ్రభాషాదేవిని అతులితకావ్యభూషల నలంకరించారో ఆ భూమిని, ఆ సీమను పుట్టిన ఆంధ్రులు- ఆంధ్రనాయకులు, పుట్టబోయే ఆంధ్రరాష్ట్రం మాకక్కరలేదంటున్నారు. ఇంతకంటె ఐరనీ వున్నదా?

తరతరాలనుండి, యుగయుగాలనుండి తెలుగుభాష పలుకుతున్న- తెలుగు రక్తం పారుతున్న, తెలుగునేల మోస్తున్న ఈ తెలుగువారు ఆంధ్రరాష్ట్రం అక్కరలేదనడానికి చెప్పే వాదాలు విచారిద్దాం.

అసలు కారణం ఆంధ్రరాష్ట్రం వచ్చిన మరునాడు సర్కారాంధ్రులు వారిని అణగద్రొక్కేస్తారన్న భయం!

ఈ భయం ఒకరు పెట్టిందో, వారికి పుట్టిందో కాని-అదీ వారి ముఖ్యభయం. అది ఎలాంటి భయం?

ఒకే జాతికి, ఒకే నాగరికతకు, ఒకే భాషకు చెందిన రాష్ట్రీయులలో, ఒక ప్రాంతీయులు ఇంకొక ప్రాంతీయులను, అణగద్రొక్కివేస్తారనే భయం!

అనాదిగా, ఆంధ్రసామ్రాజ్యాన్ని కలిసి మెలసి వున్ననాడు- ఆంగ్లప్రభుత్వారంభంనుంచి ఆంధ్రేతరులతో, కష్టనష్టాలు పడుతూ కాలం గడుపుచున్ననాడు- హాని చేయనివారు ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకంగా విడిపోయిన మరునాడు రాయలసీమవాసులను సర్కారుసోదరులు త్రొక్కి పారవేస్తారనడం—ఎంత చక్కటి వాదన!

ఇది ఆంధ్రరాష్ట్రవిభజనవల్ల కష్టనష్టాలకు గురిఅయ్యే ఆంధ్రేతరసోదరులు గరపిపుచ్చిన కుతంత్రవాదంకాని తెలుగువాడైనవాడి తలలో బుట్టే తలపులేనా?

వారననేదేమిటి? ఆంధ్రరాష్ట్రవిభజన అక్కరలేదు. అథవా ఆంధ్రరాష్ట్రమంటూ ఏర్పడితే- మేము- రాయలసీమాంధ్రులము అరవసోదరులతో చెన్నరాజధానిలోనే వుండిపోతాము- లేకపోతే ప్రత్యేకరాయలసీమరాష్ట్రాన్ని నా

నిర్మించండని. అహా! వీరికి తోడిఆంధ్రులందు లేదు నమ్మిక-' అరవసోదరులపై ఎంత విశ్వాసం—

దానికి వారు చెప్పే సాకు- రాయల సీమవారు ఆంధ్రులతో కూడివస్తే సర్కారాంధ్రులు తుంగభద్రాప్రాజెక్టు పైకి రానివ్వరట-కాని సర్కారు ఆంధ్రరాష్ట్రం వేరుపడ్డ మరునాడు అరవసోదరులా ప్రాజెక్టును అమలులో పెట్టేస్తారట. ఇంత హ్రస్వదృష్టిగల రాష్ట్రీయుల కింతవరకు ప్రత్యేకరాష్ట్రం లేదంటే ఆశ్చర్యమేముంది?

చెన్నరాజధాని పుట్టిన నాటనుండి, కాటన్‌దొర గోదావరీకృష్ణవేణుల కడ్డకట్టలు కట్టిన నాటనుండి- తెనుగునాటికి గుండెకాయలైన, తెనుగువాటికి రక్తనాళాలైన, ఆనకట్టలు మొదలు- పిల్లకాలువల వరకు అరచేతిలో పెట్టుకున్న అరవవారు—సబ్ ఓవర్‌సీరు మొదలు సూపరింటెండింగు ఇంజనీరు వరకు ఇర్రిగేషనుశాఖ ఎగ్జిక్యుటివ్ కౌన్సిల్ మెంబరు మొదలు పి. డబ్ల్యు. డి. ప్యూన్ వరకు సర్వేషాం ఆక్రమించుకుని తుంగభద్రప్రాజెక్టుపై కత్తని అరవవారు-త్రాగనీరైనా లేక నిత్యకాటకం నృత్యం జేసే రాయలసీమ నటుపెట్టి మెట్టూరులో హైడ్రాలిక్ ఎలక్ట్రిక్ స్కీములు తయారుచేసుకుంటున్న అరవవారు- సర్కారాంధ్రరాష్ట్రం విడిపోయిన మరునాడు అరవదేశంలోని డబ్బు తీసుకవచ్చి తుంగభద్రానదీతీరాన్ని ఆప్రాజెక్టుకుగాను పిల్లయారుపూజ జేస్తారట- వారు చెపితే చెప్పవచ్చు- వీ రెలా నమ్మారో?

ఇంకొకటి వార నేదేమిటంటే-చెన్నరాజధాని ఏకంగా వున్ననాడు సాగని ప్రాజెక్టు-కలుగని ఆర్థికసహాయం- మనం ప్రత్యేకంగా విడిపోతే కలుగుతుందా అని.

పైకిమాడ్డాని కిది ప్రబలమైన వాదన లాగే వుంది కాని ఒక్కనిముషం యోచిస్తే ఇది కూడా నిలిచే వాదన కాదు.

అసలు ఇన్ని నాళ్లుగా ఆంధ్రరాష్ట్రం కావాలనడం, ఆ ఆంధ్రరాష్ట్రంకోసం అల్లాడ్డం- ఆందోళన చెయ్యడం, ఎందుకని?—ముఖ్యంగా ఆంధ్రభూభాగంలో వచ్చే అధికాదాయమంతా, త్రాగ నీరు, కుడవ కూడు లేని ఆంధ్రప్రాంతాల నలా త్రోసిపెట్టి మెట్టూరులో డామ్ములు కట్టుకుంటున్నారనే కదూ?

అదనపుపన్ను వచ్చే భూభాగం ఆంధ్రరాష్ట్రంలో వుందిగాని ఆంధ్రేతరరాష్ట్రంలో లేదే? అందుచేత ప్రాజెక్టులే శీఘ్రంగా అమలులోకి రావలెనంటే ఆంధ్రరాష్ట్రనిర్మాణం కూడా శీఘ్రంగానే కావాలి.

ఆంధ్రుల అధికాదాయం 26 జిల్లాలయావత్తు చెన్నరాజధనిలో చెదిరిపోయేటప్పుడు ప్రాజెక్టు బయట కొస్తుందో కేవలం ఆంధ్రరాష్ట్రంలోనే వినియోగపడేనాడు బయట కొస్తుందో విశదమూతూనే వుంది!

అలాంటప్పుడు- సర్కారుఆంధ్రులు వారి ఆశయాల నణగద్రొక్కి వేస్తారనీ, వారి ప్రాజెక్టులను పైకి రానీయరనీ, వారి ప్రాంతీయుల కధికారవర్గంలో తా వుండదనీ అనుకునే ఆలోచన లన్నీ రాయల సీమవారి అపోహలు కాని వేరేమి కాదు.

ఇంతకూ వీరు నమ్మే దెటువంటి మహానుభావులను? తిరుచ్చెంగోడి ఆశ్రమంలో

ముక్కు మూసుకుని జపంజేసుకుంటూ—పుద్యోగస్వీకార మనేసరికి పులిక్కిపడి లేచి- ఆంధ్ర అరవ రాజధానిలో ఆంధ్రుని కెక్కడ ప్రధానత్వ మబ్బుతుందో అని, ఆశ్రమంనుంచి అశ్శెంబ్లీలోకి ప్రక్కత్రోవను ప్రవేశించి, పెరటిత్రోవను కొందరిని ప్రవేశపెట్టి- ఆకాస్త అధికారాధిక్యతను కాజేసిన అపరమహర్షులను.

ఇప్పటికైనా యోచిస్తారా రాయలసీమవాసులు- చిరకాలం విస్మరింపబడ్డ వారి లోటుపాటులు- వారి కష్టనష్టాలు- వారి కడగండ్లు అరవవారితో వున్ననాడు తీరునో- లేక అవిచ్ఛన్నాంధ్ర దేశంలో తీరునో?

ఇంతకూ ఈవాదన లెందుకు? ఈ పూర్వపక్ష సిద్ధాంతా లెందుకు? ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రం వచ్చిననాడు ఆంధ్ర భూభాగ మంతా చేరి, ఆంధ్రప్రజ లందరూ చేరి రాష్ట్ర మగుచుకాని, దేశమగును కాని ఏభాగాని కాభాగం-ఏసీమ కాసీమ విడిపోవుటకు వీలగునా? అప్పు డీవిభజన కంతు యెక్కడ? లేదు మేము అరవవారితో వుండిపోతా మంటే కొంద రరవ వారితో, కొంద రోఢ్రసోదరులతో, కొందరు కన్నడులతో కలసిపోతే ఇక ఏఆంధ్రుల కీఆంధ్రరాష్ట్రం?

ఒక రాష్ట్రమంటే, ఒక దేశమంటే, ఆ భూభాగంతో కూడిన ఆ సర్వప్రజతో కూడిన, ఒకే నాగరికత, ఒకే జాతి, ఒకే భాష గల ప్రజతోగూడిన అవిభాజ్యమైన సజీవసంస్థకాని, ఖండఖండాలుగా చేయబడగల నిర్జీవశిల గాదే?

ఒక వ్యక్తిని విభజించి బ్రతుకమనడం ఎలాంటిదో మహావ్యక్తియైన దేశాన్ని విభజించి బ్రతుక మనడం కూడా అలాంటిదే. వంగదేశాన్ని విభజించిన నాడు ఆదేశస్థులు ఆసేతుహిమాచలం ఎందుకు అల్లలాడించివేశారు? తిరిగి ఏకమగువరకు నిద్రాసుఖము లెరుగరే! అదుగు పెనక్కు వెయ్యనన్న బ్రిటిషువారిచేత చేసిన ఏర్పాటు మార్పించ గలిగారే! దేశమంటే, రాష్ట్రమంటే సజీవమైన సంస్థ కనుక- విభజించిన సజీవవ్యక్తిలోనుండు కళాకాంతులు నశించును కనుక.

ఇప్పటికే నైజామాంధ్రము మనకు ప్రస్తుతం లేకపోవడం కాలో చేయో లేని మానవుడిలా ఉంటుంది మనరాష్ట్రం- అల్లాంటప్పుడు ఇంకా ఖండఖండాలు చేసేస్తా మంటే?

ఇటువంటి భేదబుద్ధులు మాని, స్వజాతిమాత్సర్యాలు మాని పరుల చెప్పుడు మాటలు విని చెడక ఆంధ్రులు, ఆంధ్ర నాయకులు అవిచ్ఛన్నమైన, అవిభాజ్యమైన సర్వావయవసంపూర్ణమైన ఆంధ్ర రాష్ట్రనిర్మాణానికి సర్వతోముఖముగ ప్రయత్నించి సఫలు లగుదురుగాక అని నాప్రార్థన.

ఆంధ్రసామ్రాజ్యలక్ష్మి

ఆంధ్రకిశోర సింహాలు గర్జలతోడ
రణకేళి నేర్చెడు రచ్చపట్లు
అమృతకావ్యాల శౌర్యక్షాత్రభావాలు
మగగుండెలకు జొన్పు మగువపాట
అనుగుబిడ్డలకు దీవనలిచ్చి దిగ్జయ
మ్ములకన్పు వీరమాతల తలంపు
వీరయోధులు విజృంభించి మాగధపాండ్య
రాజ్యముల్గొన్న వజ్రాలయుగము

కాలచక్రపరిక్షుణ్ణకమ్ములైన
నేమి ఈనాడు మరల సృష్టింపగలము
కాంచుమా ! అస్వతంత్రదుఃఖమ్మువాసి
రాజ్యవిభవమ్ము లాంధ్రసామ్రాజ్యలక్ష్మి.

[illegible]

‘దాంపత్యసౌఖ్యానికి సరసమనేది అవసరమయిన హంగు’

స ర స ం

“సరస మంటే
మాటలతో
చూపులతో
చేష్టలతో
స్త్రీపురుషు లొకరిపట్ల ఒకరికిగల
‘సెక్సు’ అనురాగాన్ని వ్యక్తపరుచుకోవడం.”

ర చ యి త :
తాత కృష్ణమూర్తి, బి.యే., ఎల్.టి.

సరసమంటే మాటలతో, చూపులతో, చేష్టలతో స్త్రీపురుషులొకరిపట్ల ఒకరికిగల ‘సెక్సు’ అనురాగాన్ని వ్యక్తపరచుకోవడమన్నమాట. దాంపత్యసౌఖ్యానికి యిది అవసరమైన హంగు. కాని దంపతులకంటె యితరులలోనే యిది హెచ్చుగా ప్రకటితమవుతూ ఉంటుంది.

సరసం ఒకకళ

తక్కిన విషయాలలో వెనకబడి ఉన్నట్లుగానే, సరసాలు చేసుకోవడంలోకూడా మన దేశం ఎంతో వెనకబడిఉంది. అందుకనే కన్యాశుల్క నాటకంలో గిరీశం యిట్లా విలపిస్తాడు :—

“సీమలో లాగ బ్యూటిఫుల్ షెపర్డెస్లూ, లవ్ మేకింగూవుండదోయి. గ్రాస్ గరల్సు తగుమాత్రంగా వుంటారుగాని, మా డర్టీ స్మెల్. అదోహాటిన్నీ, మన దేశంలో మెయిడన్సు వుండరోయి. యంతసే లవ్మేకింగ్ విడోజ్కి చెయ్యా మరి సాధనాంతరం లేదు.”

ఇవరకు మన మతాచారాలు, సంఘనియమాలు మనని బిగపట్టి, స్వేచ్ఛలేనివారినిగాను, కృత్రిమజీవులనుగాను చేస్తున్నాయి. సరసం అనే కళను అద్భుతమైన అభివృద్ధిలోకి తెచ్చినవాళ్లు నిజంగా పాశ్చాత్యులు. వారి ఊహలు, ఉద్దేశాలు మనకీ ఉన్నవన్న మాట సత్యమే. కాని వారివలె వాటిని అమలులోపెట్టి అనుభవించడానికి మాత్రం మనం అంతగా నోచుకోలేదు. సారెగదిలోనైనా గట్టిగా ముద్దులాడుకుందుకుకూడా తగిన ‘ప్రైవసీ’ లభించని హిందూ దంపతులకు తెల్లవాళ్ల షికార్లు, వూఇంగులు, కోర్టింగులు, డాన్సులు, హనీమూన్లు ఎట్లా అర్థం అవుతాయి?

మానవసంఘంలో దీనికి ఒక కాలనియమంకాని, నీతిధర్మంకాని లేకపోవడంవలన, ఎప్పుడు ఎవరు ఎట్టివారితో ఏవిధంగా సరసంచేస్తారో, చెయ్యవచ్చునో, ఎవరూ నిర్ణయించలేరు. పురాణంకథలు, కామశాస్త్రగ్రంథాలు ప్రత్యేకవ్యక్తులకు తటస్థపడే ప్రత్యేకపరిస్థితులలో వాళ్ళకు రవంతయినా ఉపకరించవు — ఉపచరించలేవు! ప్రేమకలాపాలకు వసంతరుతువు, హేమంతరుతువు అనుకూల సమయాలని గ్రంథాలలో ఘోషిస్తారు కవులు. అలాగని, తక్కిన రుతువులలో ఆ ఊసుతలపెట్టకుండా ఉండేవాళ్లు ఏరీ? కూడనిపనులు చెయ్యడానికి మానవులలో ఉండే అభిలాష యితర జీవకోట్లలో వేటికీ లేదు. దేవుడు నిషేధించిన ఆపిల్ పండు ఆదిదంపతులు (ఈవు, ఆడమ్) కొరికి పంచుకొని తినడంవల్లనే తెలుస్తూఉంది మానవస్వభావం ఎటువంటిదో.

స్త్రీలతో స్త్రీలు

సృష్టిలో మరి యేప్రాణికీ యివ్వని రీజన్ (పరామర్శజ్ఞానం) అనే అపూర్వమైన శక్తిని మనిషికి ప్రసాదించాడు దేవుడు. దాని ప్రభావం వల్లనే ప్రకృతి నిబంధనల నతిక్రమించికూడా చిత్రంగా నెగ్గుకొస్తున్నాడు నరుడు. పిట్టలకుగల ఎగిరే శక్తి, చేపలకుగల యీదేశక్తి తనకు సహజధర్మాలు కాకపోయినా, వాటిని అలవరచుకొని, వాటి ఉపయోగాలను పొందుతూ, ప్రకృతిని ధిక్కరించ గలుగుతున్నాడతడు. కనుకనే ఒక్కొక్కప్పుడు దేవతలనుకూడా ఆశ్చర్యపరచేటట్లు ఉంటాయి అతని ప్రణయలీలలు ! పురుషులతో పురుషులు, స్త్రీలతో స్త్రీలుకూడా సరసాలుచేసుకోగలరనికాని, చేసుకుంటారని కాని, సృష్టికర్త ఎన్నడైనా ఊహించుకొని ఉంటాడా ?

కొన్ని పెద్దజాతి కోతులకు తప్ప, యితరజంతువులకు ఏదో ఒక కాలనియమం అంటూ ఉన్నది, ప్రేమసౌఖ్యా లనుభవించడానికి. కొన్నికొన్ని ఋతువులలోనే తప్ప, వాటికి కామేచ్ఛ బొత్తిగా ఉండదు. కనుకనే జంతువులకంటె తానెంతో అధికుడనని గర్విస్తాడు నరుడు. నిర్ణీతఋతువులలోనే గాక, అన్నివేళలయందూ అతనిలో సంభోగవాంఛ నిత్యాగ్నిహోత్రంవలె రగులుతునే ఉంటుంది. * ఒకప్పుడు ఏ కారణంచేతనైనా అది చల్లారిపోయినా, చల్లారనట్లే



వ్యాసకర్త :
తాత కృష్ణమూర్తి, బి.ఏ.,ఎల్.టి.

నటించగల సమర్థుడతడు. కో

> 'In spring, and also in summer, autumn and winter, a young man's fancy lightly turns .'
> You never can tell.
> (Bernard Shaw.)

> 'In the spring a young man's fancy lightly turns to thoughts of love.'
> (Tennyson.)

ర్కా లేకపోయినా సరసాలాడగల నేర్పరితనం, మోసబుద్ధి, ఒక్క మానవజాతికే అనుగ్రహించాడు భగవంతుడు. జంతువుల సరసంలో ఒకవిధమైన సమానరూపత్వం పొడగడుతుంది ఒక్కొక్కజాతి జంతువులన్నీ ఒకేమోస్తరు విధానాన్ని అనుసరిస్తాయి. ఒక కోడిపుంజు ఒక పెట్టతో ఎట్లా సరసం చేస్తుందో, అన్ని పుంజులూ - వాటి పెట్టలతో యించు· అదే మాదిరిగా సరసం ·

మనలోవలె జంతువుల సరసంలో ప్రత్యేకత్వం కాని, వివిధత్వం కాని అట్టే అగపడదు.

సరసం మగజాతిది

సరసంచేయడంలో ఎక్కువ నేర్పరితనం అన్ని జీవులలోను సాధారణంగా మగజాతిది. ఆడజాతిని వెన్నాడి, మెప్పించి, లోంగదీసుకొని, సుఖపెట్టడానికి వలయు సాధనసామగ్రినంతా మగజాతికి అనుగ్రహించాడు సృష్టికర్త—రూపగాంభీర్యం, శరీరబలం, ధైర్యసాహసాలు, సంతానపోషణశక్తి, యిత్యాదులు. అయితే మానవజాతిలో భగవంతుని యీ యేర్పాటు కొంతవరకు తారుమారు అయిపోయింది. మగవాడితో అన్ని విషయాలలోను సమానత్వం కొరకు పోట్లాడుతూ ఉన్న నేటి యిరవయ్యోశతాబ్దపు స్త్రీ అతగాడిని తోసిరాజనుచేసి, సరసాలాడడంలో తానే అగ్రస్థానం ఆక్రమించుకుంది. దీపంచుట్టూ చేరే రెక్కపురుగుల వలె పురుషులామె అందానికి ముగ్ధులవుతున్నారు. ఆమె తన రూపంతో, వేషంతో, మాటలతో, పాటతో, ఆటతో, అభినయంతో మగవాడిని ఆకర్షించి తనచేతి కీలుబొమ్మను చేసుకుంటా ఉంది.

కృతిలో కొన్నికొన్ని జంతు
గారచర్యలు మానవుడికి
నేర్పేటంత చిత్రంగా ఉంటాయి.

మగతేలు ఆడతేలును సమీపించి, దాని ముందుగోళ్లను ప్రేమతో పట్టుకొని వెనుకకు నడుస్తూ, తనతో దానిని చాలదూరం యీడ్చుకొని పోతుంది—పాశ్చాత్యులలో ప్రియులు ఒండొరుల చేతులు పట్టుకొని మైళ్ళకొలదీ షికారులు తిరిగే మోస్తరుగా.

జంతువుల్లో

మగసాలీడు తన ప్రియురాలిని మెప్పించడానికి చిత్రంగా నృత్యం చేస్తూ, దాని కాళ్ళమధ్య దోబూచులాడుతుంది. కాని అతిజాగ్రత్తగా ప్రవర్తించకపోయినా, తిన్నగా ప్రేయసిని రంజింపజేయలేకపోయినా ప్రాణాలపై ఆశ వదులుకోవలసినదే అది. ఏమంటే, ప్రియుని లాలింపు తృప్తికరంగా లేకపోతే అతన్ని పీకకొరికి చంపేస్తుంది ఆడది. సాధారణంగా సంభోగానంతరం ప్రియుణ్ణి చంపి తినివేయడమే ఆడపురుగు నైజం! మానవసంఘంలో వేశ్యల ప్రవర్తన తమ సరసులపట్ల యించుమించు యిట్లానే ఉంటుంది.

'ఎంపిడ్స్' అనే ఒకజాతి యీగలలో మగపురుగు చిన్నచిన్న కానుకల నర్పించి ఆడపురుగును వశపరచుకో జూస్తుంది—ఒక ఆహారపదార్థమో, రంగుపెంట్రుకో, పువ్వురేకో, ముచ్చికాగితమో యేదోయిచ్చి. తెల్లవాళ్ళలో తరుచుగా సరసులు తమ ప్రియురాండ్రను యీవిధంగానే మచ్చికచేసుకుంటూ ఉంటారు. హోటేళ్ళకు తీసుకొనిపోయి మత్తుగా మేపడం, ఛాకొలేట్ డబ్బాలు—పూలగుత్తులు పంపడం, ముత్యాలహారాలు—దుస్తులు కొనిపెట్టడం, వాళ్ళలో పరిపాటైన సంగతి. మనవాళ్ళకు కూడా సరసం విషయంలో యీ బహుమానాల ప్రయోజనం తెలుసు. చీరెలు, నగలు సమర్పించి ప్రియురాండ్రను సంపాదించే మగవాళ్లు అనేకులు. మహావీరులు, రూపవంతులు, రసికులు అయిన మన ప్రబంధనాయకులు సహితం యీ అస్త్రాన్నే ప్రయోగించేవారట అందమైన స్త్రీలను గెల్చుకుందుకు. నాయకి వద్ద ఒక మహారాజు యిట్లా ప్రాధేయపడేవాడని చెప్తాడు తిమ్మకవి :—

"పాలిండ్లు కెంగేలఁ బట్టనిచ్చిన మేటి
కళుకుబంగరుగిండ్లు కానుకిత్తు
వలపార ననుఁ జూచి కిలకిల నవ్వినఁ
బేరైన ముత్యాల పేరు లిత్తుఁ
దావి నిద్దంపుఁ గెమ్మోవి ముద్దొసఁగిన
సొంపు రాణింపు బల్కెంపు లిత్తుఁ
దళుకు లేఁ జెక్కుటద్దము లంట నిచ్చిన
వెలలేని వజ్రంపుఁ బలుక లిత్తుఁ
బాలపాన్పునఁ గొదలేని హాళి నతను
కేళి నోలాడఁజేసిన లీలఁ గ్రాల
మేలి సామ్రాజ్య మితు నివ్వాళి యింత
గోలతనమేల నను నేలుకొనవె బాల."

మగకప్ప తన వలపును ప్రక

టించుకోవడానికి బెకబెక కొంతసేపు అరచి, దగ్గిర అందుబాటులో ఉండి దొరికిన యేఆడకప్పతోనైనా సంబంధం కుదుర్చుకుంటుంది-- పురాణంశాస్త్రిల్లుగారు వెధవ ముండను దొరికించుకున్నంత సుళువుగా! మన మతబోధకులు, హరిదాసులు, పగటివేషగాళ్లు, బైరాగులు, నాటకాలాడేవాళ్లు, భజనపరులు, గాయకులు మొదలైన వాళ్ళంతా ఒక్కొక్కప్పుడు నిజంగా కప్పలకంటె సునాయాసంగా సంపాదిస్తారు ప్రియురాండ్రను.

పక్షుల్లో

రమ్యమైన రంగురంగు యీకల సహజ శృంగారంతోను, ముద్దులొలుకు ఆటపాటలతోను, పిట్టలు చేసుకునే సరసం మంచి ఆహ్లాదకరంగా ఉంటుంది. మగపిట్ట శ్రమపడి నాచు, ఆకులు, తినేపురుగులు, పండ్లు మొదలైన చిన్నచిన్న కానుకల నేవో తెచ్చి అర్పించి, ఆడపిట్టను నృత్యగీతాలతో రంజింపజేసి వశపరచుకుంటుంది. ఆడపిట్టకు కనబడేలాగున సమీపంలో ఒక చెట్టుకొమ్మపై వ్రాలి, గొంతెత్తి మధురంగా పాడుతూనో, లేక తోకవిప్పి నెమలివలె ముచ్చటగా ఆడుతూనో సరసాలాడ మొదలిడుతుంది మగపిట్ట —పొరుగింటి అమ్మాయిని ఆకర్షించడానికి అందమైన దుస్తులతో ముస్తాబై, గిరిజాలు నున్నగా దువ్వి, కళ్లు తేలవేస్తూ, కిటికీవద్ద చేరి, ప్రణయగీతాలను కూనిరాగాలు తీసి పాడే భావకవివలె!

కొన్నిజాతుల పక్షులలో మరొకచిత్రం ఏమిటంటే, వాటివాటికి అనుకూలములైన ఋతువులలో మగపిట్టలన్నీ తోటలలోనో, అడవులలోనో, ఏదో ఒకచోట సమావేశమై, ఊరిచివర తోటలో విడిది దిగి వియ్యాలవారికోసం ఎదురుచూసే మగపెండ్లి వారివలె, ఆడపిట్టల రాకకై తహతహలాడుతూ కనిపెట్టుకొని ఉంటాయి. క్రమంగా కొంతసేపటికక్కడికి ఆడపిట్టలన్నీవచ్చి, నలువైపులా కొన్ని పర్యాయములు తిరిగి, ఆ పిమ్మట జాగ్రత్తగా—పూర్వం మన రాచకన్యలు స్వయంవరాలలో భర్తలను ఎన్నుకున్నట్లుగా—తమతమ జోడుపిట్టలను ఎంచుకొని క్రీడిస్తాయి. ఒక్కొక్కప్పుడు అట్టి సమావేశాలలో ఒకే ఆడపిట్టకోసం పెక్కు మగపక్షులు తగవులాడుకొని ఘోరమైన యుద్ధాలు చేస్తాయి-- హెలెన్ కోసం గ్రీకులు, ట్రోజనులు పోట్లాడుకున్నట్లు. ఆస్ట్రేలియాలో కాకిజాతికి చెందిన ఒకరకం పక్షులు తమ ప్రేమనృత్యాలకై ప్రత్యేకంగా విశాలమైన పందిర్లను నిర్మించుకొంటాయట. వాటిని పుష్పాలతోను, రంగు యీకలతోను, మెత్తని ఆకులతోను శోభనమందిరం వలె అలంకరిస్తాయట కూడాను. *

చౌసీతిబంధాలు

సృష్టిలో విశదపడే యిట్టి శృంగారసామగ్రినంతా తనదిగా చేసుకొని, నూతనపద్ధతుల నన్వేషిస్తూ, చేకూరెడి సౌఖ్యాలతో సుళువుగా తృప్తిపడక, ఎప్పటికప్పుడు పరిశ్రమలుచేస్తూ, ప్రేమరహస్యాలను స్వానుభవంవలన అర్థంచేసుకుందుకు యత్నిస్తునే ఉన్నాడు నరుడు. పిట్టలరంగులను చూసేకాబోలు, రమ్యంగా దుస్తులతో ముస్తాబవడం నేర్చుకున్నారు మానవప్రియులు. వాటినుండే సంగీతంపాడడం, నాట్యంచేయడం— అవి ముక్కులు రాసుకొన్నట్లుగానే మూతులుకలుపుకొని ముద్దులాడుకోవడం—అన్నీ నేర్చుకున్నట్లున్నారు. పాములు క్రీడించుకున్నప్పుడు ఒకదాన్నొకటి చుట్టుకుపోయినట్లు మన నాయికానాయకులు చేతులు భుజాలచుట్టూ పెనవేసుకొని ఊపిరాడనట్లు బిగువుగా కౌగలించుకుంటారు. కుక్కలమాదిరిగా ఒక్కొక్కప్పుడు ఒళ్ళంతా గాట్లుపడి రక్తాలొచ్చేటట్లు కరుచుకుంటారు కూడాను. మన కళాశాస్త్రంలో పేర్కొనబడిన చౌసీతిబంధాలన్నీ ప్రకృతిలో ఉ-
ఉదాహరణాల ననుసరించి
చబడినవే నేమో!

---

* The Miracleof Life

చీపురుకట్టసరసం

నేటి మానవసంఘంలో సరసమనేది ఒక గొప్ప శాస్త్రంగా అభ్యసింపబడుతూ ఉంది. నిజానికి సరసం ఒక అద్భుతమైన కళ. స్వభావసిద్ధంగా అది అలవడినప్పుడే దాని శోభ. గురువుల ఉపదేశాల వలన, పుస్తకాలలోని పాఠాల వలన నేర్చుకున్నది యెరువుసరుకు వలె అంతగా రాణించదు. అదిగాక, ఒకజీవికి ఆహారమైన వస్తువు మరొకజీవికి విషమైనట్లు, ఒకరికి ఆనందం కూర్చగల సరసవిధానం మరొకరికి దుస్సహంగా తోచవచ్చును. బీదవాళ్ళ సరసాలు ధనికులకు రోత. బలవంతుల సరసాలు మృదువర్ణకు మోటు. పామరుల సరసాలు నాగరికుల కసహ్యం!

ఆడగాడిద తన ప్రియుణ్ణి వెనకకాళ్ళతో మూతి పగిలేటట్లు తంతుంది. దానిబుద్ధి కది మహానాజూకైన సరసం. శ్రీకృష్ణునివంటి రసికాగ్రేసరులకు మాత్రమే అట్టి సరసంలో ఉండే స్వారస్యం అవగాహన అవుతుంది. అల్పప్రజ్ఞావంతులగు సామాన్యసరసులకు సత్యభామవంటి ప్రియురాలి కాలితన్నులలో అసలు శృంగారమే కట్టక పోవచ్చును.

సొగసుకత్తెలకి అలకకూడా శృంగారం సుమండీ, శాస్త్రుల్లుగారూ!" అన్న రామప్పపంతులుతో కరటకశాస్త్రి నుడివినది మనలో చాలామందికి వర్తిస్తుంది:

"వైదీకపాళ్ళం మాకా శృంగారాలు యలా అనుభవమౌతాయండి? మా యిల్లాళ్ళ కోపం వొస్తే చీపురుగట్టలు యెగురుతాయండి. సరసవన్నది పుస్తకాల్లో చదవడమే గాని మాకు అనుభవవేద్యం కాదండి."


[నమ్మాళ్వార్లు ప్రచురిస్తూవున్న 'వలపు' అనే గ్రంథంనుండి.]

మ తి లే ని క డు పు మ ం ట

ఏపురమ్మున కాజ్ఞయిచ్చె రాంధ్రతమా పాలకుల్ శతశతాబ్దములకో లేది
ఏ పురమ్మున కాఖ్యయై పొల్చు దామెర్ల వెలమవీరుని చెన్నవిభునిపేరు
ఏ పురీపాలన వ్యాపారసభ నందె నగ్రతాంబూలంబు నంధ్రభాష
ఏ పురాభ్యుదయమ్ముకై పంచిపెట్టె మాతిమ్మనాయండు మందిరసహస్ర

మే పురమ్మున కలరు జెంటూపురాఖ్య
యే పురం బది మదరాసునై పొసర్చు
నా పురం బాంధ్రలక్ష్మికిం గాపురమ్ము
కాదుకా దంట మతిలేని కడుపుమంట.

—రాష్ట్రగానమునుండి 'కొగడా' ఉద్ధృతము.



౨౯౨. పాంచజన్యం

'చక్రపాణి'గారి అనువాదరాజకీయ కథల సంపుటి. ప్రచురించింది: నవశక్తి కార్యాలయం. వెల అణాలు ఆరుమాత్రమే. ప్రతులకు యువకార్యాలయం, తెనాలి వ్రాస్తే దొరుకుతవి. చక్కటి అచ్చు. నెమలితురాయి పిల్లిశంఖంపూరిస్తోన్న ముఖచిత్రం- పుస్తకాలంకారం.

పీఠికలో శ్రీపుచ్చలపల్లి సుందరయ్యగారు ఈపుస్తకంలోని ఎనిమిదికథల్ని గూర్చివ్రాస్తూ యిల్లాఅన్నారు ఆఖరిని: 'ఇల్లాంటి కథలు బెంగాలీభాషనుండి అనువదించి ఇచ్చిన చక్రపాణికి ఆంధ్రులు కృతజ్ఞులు. కాని ఆంధ్రభాషలోనే ఇట్టికథలు స్వతంత్రంగా ఎప్పటికి రచించడము ?'

తుచ తప్పకుండా ప్రతిమాటా పట్టి పట్టి మళ్లా అంటున్నాను అవే. శ్రీచక్రపాణిగారి వ్రాతలు చదువుతూంటే, చుంబనంలోని చురుకులా ఝల్లున ఒళ్లంతా విద్యుత్ప్రసారమై పోతుంది.

పరువంగలవ్రాతలు ఏభాషలోఉంటేంకే? అనువాదానికి తగ్గ చేయి దొరకినప్పుడు తప్పక తర్జుమా కోరవలసిందే.

పైగా వీరు చేసినవిశేషం ఇంకోటి. ప్రతికథకీ ముందుగా ఓపేజీలో నాలుగు పంక్తుల్లో అసలు ఆకథ ఎవరువ్రాశారో వారిజీవితసంగ్రహం లిఖించారు. ఈపద్ధతి బాగుంది.

అనువాదకులు ఒక్కొక్కకథ ఒకొడికి అంకితం అంటూ 'భారవిసర్జన' అన్న తమ మున్నుడిలో కారణాలు సూచిస్తూ—రాజకీయకథలు కావండీ!-వ్రాశారు. ఈ అనువాదకుడు స్వతంత్రించి వ్రాసేకథలే వస్తే, ఎవరబ్బా 'చక్రపాణి' అనిలోకం విరగబడిచెప్పకుంటుంది.

—అత్రిలివారు.

౨౯౩. ఆవేదన

పద్యకావ్యం.

ప్రతులకు: బి. సుబ్బారావుగారు, 68 మేడాక్సువీధి, వేపేరీ, మద్రాసు. అని వ్రాయాలి.

వెల : నాలుగణాలు, పోష్టుఖర్చులు కాక.

కవి : శ్రీ. బి. ఎస్. మూర్తిగారు.

శ్రీ చిలకమర్తిలక్ష్మీనరసింహము పంతులుగారు పీఠిక వ్రాసారు.

హరిజనాభ్యుదయమునకై వ్రాయబడిన ఈకబ్బములో ఈశ్వరధ్యానము, భారతమాతృస్తవము, గాంధీస్తుతి, అస్పృశ్యతానిరసనము ; మేలుకొలుపు, ఆకాశవాణి, హరిజనకుమారి, మతపరివర్తనము, ప్రబోధము—అన్నశీర్షికలలో చక్కటి వృత్తగీతము లున్నవి. మేలుకొలుపుమాత్రం అనువైన పాటనడకలో నడిచింది.

శ్రీ మూర్తిగారు రాజకీయాలలోనే గాకుండా, ఆంధ్రభాషామతల్లిని కొలిచే మార్గంలోనూ విశిష్టత కూర్చుకొన్నారు. రసవత్తరగ్రాంధికరచన వీరి కిష్టము.

'జ్ఞానియు నిసీ చిత్తంబులో మాలమాదిగ లస్పృశ్యులటంచు కొంచ నీక నేదిదిక్కు' అని ఈశ్వరుని ప్రార్థిస్తారు వీరు—జ్ఞాని, సత్యం యిదిఅని నిజంగా తెలిసికొనేఉంటే స్పృశ్యాస్పృశ్యత మనసు కెక్కడిది! అప్పట్లో మన 'యిసీ'—భేషల కతీతుఁడే కాదా?

కందపద్యాలు కదళీపాకంలో నట్టు లేకుండా నడపటంలో వీరికలానికి చురుకు చాలాఉంది.

'హరిజనకుమారి'—ఈపేరటవ్రాసిన గీతాలు హృద్యాలు, కళ్లు చెమ్మగిలజేయు రసవత్తర ఘట్టం అది.

'తిరకలమైన మాత్రమున దున్నలగాసెడఁ వృత్తి దప్పనే?' అనిన్నీ, 'రండు మరి యాసుతు గొల్వుడటంచు బల్కువారి సరి కేమిజేసి రట హెచ్చులుతగ్గులు లేకపోయె నే?' అనిన్నీ స్వమతమువీడి పెరమతావలంబకులగు వారికళ్లు తెరచుచున్నాడీ కవి. పైగా 'మాలమాదిగ భేదముల్ మానకున్న...గలుగబోదు సమానత్వ మిలను మనకు' అని హెచ్చరించుచున్నాడు. కావ్యం సరసంగాఉంది

—అత్రిలి

౧౫౪. ప్రేమతపస్విని

ఖండకావ్యం.

కావ్యకర్త. శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారు.

వెల 0-6-0. దొరకుచోటు కవిగారిపేర, తలమర్ల, కట్టచెరువుపోష్టు, అనంతపురం- అని వ్రాస్తేచాలు.

కవి తమ పుస్తకాన్ని పాఠకులకు పరిచయముచేస్తూ 'ఇది నాతొలిమొగ్గ. పవిత్ర ప్రేమోపాసనమున జీవితముగడపు పల్లెపడతి ఏకాంతమును సంబోధించుచు స్వీయగాథను జెప్పికొనుట యీ ఖండకావ్యమునందలి వృత్తాంతము' అని చెప్పారు.

'పల్లెలోఁ బుట్టి పెరిఁగిన పడఁతిగాన- మధురవాక్పరంపరలతో మనసు నలరఁ- జేయునోలేదొ' అని కవిసంశయం. 'బాలరసాలసాలనవపల్లవకోమల కావ్యకన్య' కూడా పల్లెపడఁతియే!

ప్రేమభావానికి పల్లె, పట్నం- వివక్షతలు అడ్డురావుగా! 'నిర్దయమతియైన కాల మనురాగపుఁదీపి యెరుంగలేమి' ప్రియతములైన వారినిటు వేఱొనరించి తపింపఁజేసె' నని వాపోయి, 'ప్రళయమభినవసృష్టి కేర్పడునొ యేమొ' అనే సమాధానం చెప్పుకుంటాడు.

'పొలమున కంచెపై బెరిఁగి ముద్దులు గుల్కెడు చిన్నిపూవు' 'అనిలతరంగ సంహతుల నట్టిటు లూఁగెడు జొన్న చేల' సౌందర్యాలు ఎన్నడో కలసి మణగిన తమప్రేమ చావులు ఊటలెత్తగా చిందిన నీటికణాలు—పద్యాలు.

'గాఢవియోగవిషాద' మనుభవిస్తూ ౧తిలాలితమగు నీప్రపంచమున లేవె సులైన మార్గముల్' అనే ఊట ౨టాడు.

'కడచిపోయిన యేనాటికథలొ ద్రవ్వియీమనోవ్యథ బెంపగానేల నింక?'

అయినప్పంటికి:

'హృదయమున్నది యేని యాలింపగలవు. భావబంధురమైన నాప్రణయగీతి' -యీపలుకులు హృదయాన్ని ఎంతగా అల్లాగల్లాగ కదలిస్తూన్నాయో చూశారా?...కవీ! 'రసార్ద్రింబగు గీతముల్ పతము నాలాపించి' శాంతించకుమా పాడుమో కోకిలా పాడు! వినుగుపుట్టనే పుట్టదు.

—అత్తిలివారు.

౩౫౫. కరుణకుమార కథలు

పుస్తకాలు చిక్కేతావు: ఆధునిక వాఙ్మయకుటీరము. నెం 1, స్పర్టాంక్ 2-వ వీధి, ఎగ్మూరు, మద్రాసు.

ఎరిగున్న విషయాలే. అయితేనేం? 'సామెత చెప్పినట్టు' అంటూ ఏదో ఒక సంగతినిగూర్చిన ప్రస్తావనవస్తే పలకటం అలవాటైంది.

చెప్పవచ్చిన సంగతేదో రెండుముక్కల్లో తేల్చక, వన్నెలూ చిన్నెలూ కాకపోతే మానిరి, విషయానికి దరిదాపుల్ని ఉండేవన్నీ, యిక్ష్వాకుల నాటిగాథల్ని తడవుతూ కొసకి 'యిల్లాఅయింది,' అన్నప్పుడు, 'ఆసి! నీకడుపుడకా! యీ కాస్తముక్కా కథలా చెప్పావుకదరా!' అనటంకూడా కద్దు మనం.

ఇంతకీ ఆ పెద్దమనిషి యింతగా 'కథ' అనుకొనేట్టు చెప్పటంలో ఉద్దేశం ఏమిటంటారు? ఎప్పుడైనా అడిగిచూశారా? ఆఁ! ఎందుకడుగుతారు? మీకు మాత్రం తెలియదూ? మిమ్మల్నీ అడుగుతారు, ఎవరైనా రేపు!

అసలు ఉద్దేశం అందరికీ తెలుసు. అదే నాందిగా 'ఎరిగున్న విషయాలే' అని చెప్పుకుంట! సూటీగా ఒక్కముక్కలో తేలిస్తే, మనిషిబుఱ్ఱలో పెకనుకు వేలతెళ్లను తెరలుగా తగ్లిపోయే విషయతరంగాల తాకుడుకు కొట్టుకుపోయి ఏసుూలనో చిక్కువడి మరగుపడవచ్చును.

కథగా చెప్పటంలో—సుళువుమాట అల్లాఉంచి—దాని చమత్కారం ఏమిటంటే- మనస్సుకు పట్టి, కర్తవ్యాన్ని, పనిలోపని, చెప్పకుండా చెప్పటం అవుతుంది. పైగా ఆ చెప్పటంలో, మాటల కూర్పూ, పొందికా, ముగింపూ, ఎత్తుగడా వీనిని బట్టి అనుశ్రుతంగా నిలచిపోతారు- ఆకథలలోని వ్యక్తులు.

గజకచ్ఛపవివాదం-గజేంద్రమోక్షం, రెండూ రెండువిధాలైన విషయాలే. అయినా గజేంద్రమోక్షం కంఠతాపట్టి మోక్షానికి దారులు వెతుకొన్నారు. అట్టి పారానికి వీళ్లుపద్యరూపంలోనే అనువు అనుకొని కథలు అల్లపడ్డాయి.

వచనరూపం వచ్చేప్పటికి సంధి—విగ్రహంలాంటి గజిబిజి జిగిఅల్లిక పెద్ద కథా సంహింతగా తయారైంది. రాను రాను ఏమనుకున్నారంటే, అర్థాలు వెతుక్కునే బాధపడి అన్వయక్లిష్టాల సుడులలో గిరగిరా తిరగలేక, మామూలు మాటలూ సంభాషణాలో హృదయం కరగించే ఘట్టాలు, వర్ణితాలవటంలోని సున్నితం మెచ్చుకొన్నారు.

ప్రత్యేకం సంఘంలో తలకాయగా ఉన్న వ్యక్తులూ, వారి సంబంధాలకే నడిపించిన కలాలు, యిప్పుడిప్పుడు అఖ్తే మార్చేసి, మనిషికి పాదాలూ అవుసరమే- సేవకు, సేవకునికీకూడా సంఘంలో స్థానం ఉంది—అన్నసంగతికి మళ్లాయి.

అల్లా మల్లిన పటుత్వంగల కలంపట్టిన వారిలో 'కరుణకుమారు'లచేయి బాగా తిరిగిందనే చెప్పాలి.

ప్రాంతీయపదాల్ని బాగా వాడటానికి దారిచూపినవారు శ్రీఉన్నవ లక్ష్మీనారాయణపంతులు గారు.

తమరచనలు ప్రత్యేకంమారుపేరుతో వ్రాయటం యీనాట ఇంగిలీషు మొదలైన భారతేతర సాంప్రదాయం; అనుకుంటే, పురాణయుగంలో అనేకమంది అజ్ఞాతకవులు తమరచనల్ని. ఏ గొప్ప గ్రంథాలల్లోనో యిరికించి, అంతతో నే తృప్తిపొందినవారి అనుకరణమే యీపద్ధతికి మూలం అనుకోనటంకూడా సత్యదూరం కాదనుకుంటాను.

ఇక కరుణకుమారుని ఆరుకథల్ని గురించి :

ఆకలిమంటలు—శీర్షిక అందమైన మాట. కూరలమ్ముకవాళ్ళవద్ద కొసరుకీ, వెలతక్కువకీ పీకులాడటం, ఉన్నవాళ్లే అయినా ఆడంగులలో అధికంఅన్నది చక్కటి జాతీయాలలో నడచింది. కూలినాలిచేసే బీదాసాదా వర్తనాల్ని, పరిసరాల్ని, చక్కగా తిలకించివ్రాశారు. పొంచిఉండి విన్నట్టు. నిజంగా ఆపలుకులు చదివితీరాలి.

'కొత్తచెప్పులు' పల్లెటి దిక్కులో కాస్త అర్ధబలంఉన్న ఆసామీ చెలాయించే అధికారం వర్ణితం. 'బలవంతమైన సర్పము చలిచీమలచేత జిక్కి చావదె!' అనే నీతి యధార్థంలో ఆఖరికి ప్రాణంలేని 'కొత్తచెప్పులు' కూడా పగతీర్చుకుంటాయి. అర్ధబలంకంటె అంగబలంలోఉండే విశేషం, అన్నింటికీ మించి, గ్రామమొత్తంమీదవచ్చిన పనిలో వర్ణవ్యవస్థ అడ్డురాదన్నది ప్రత్యక్షం- ఈ కథలో కరుణరసంప్రధానం. పిల్లినియింట్లో పెట్టికొట్టబోతే—తప్పించుకోదారిలేక. ఎదురుతిరిగి గుడ్లుపీకుతుంది—ఈసంగతి జ్ఞాపకపరుస్తోంది.

పోతే ఇంకమూడోకథ : సన్మానం.

ఈకథావస్తువు సామాన్యంగా ఉద్యోగస్తులు-వారి సర్క్యూట్లు-తణిఖీలు. వచ్చే బత్తాయిఫలాలూ, యిచ్చేవిందులపైనా ఎంతవరకూ ఆధారపడిఉంటాయో చెప్పటంలో పనిలోపని, ఇన్స్పెక్టరు గారికి సన్మానం జరిపి తానొక పచ్చడం కప్పించుకోదలచి, దగ్గరున్న పట్నానికేగి పూలదండలూ పళ్లూకొనటంలో 'నొక్కు' రూపాయమిగిలి దాన్ని మార్చి రైలుటిక్కట్టుకొందామనుకోటంలో, పాపం, ఓఅమాయకుడు టిక్కట్టుతెమ్మంటే దొరికిందిరాసందు అనుకొని తానే 'తాను తవ్వుకొన్న గోతిలో ఎల్లాపడ్డాడో' చక్కటి హాస్యంలో దొర్లించారు.

ఇక 'వెంకన్న' నాల్గోది.

రైతునకు పశువంటే ఎంతమమకారమో, పశువుకున్న విశ్వాసం మనిషికి ఉండదన్నసంగతీ, గ్రామంలో మునసబుకర్ణంకలిస్తే సామాన్యంగా ఏగోడూ ఎరుగని ప్రజలకు అపన్ను అనీ. యీపన్నుఅనీ, ఆఖరికి శిమీపజ భూములకికూడా, కన్పడకుండా ఎల్లాగశిస్తు గుంజుతారో, ఆరైతు- 'మీరే తల్లిఅయినా తండ్రిఅయినా...మీరేంచేస్తే చెల్లుబడి కాదు గనుక!' అని విన్నవించుకొన్న కరగని మనసులూ వర్ణించారు.

ఐతే! సంభాషణంతా గోదావరి వాళ్లకి పడమటి ఖత్తుగా నడిచింది, పాత్రల్ని బట్టి వ్రాయటం గనుక.

పెండ్లిముచ్చటకథ—అయిదోది.

ముచ్చట మాట ఎల్లాఉన్నా, అసలు సంబంధమే పిల్లకి దొరకటం కష్టమైపోయి, చివరికి తనపై అధికారి పుణ్యమా అంటూ కుదిరి పెళ్ళివారు తర్లిరావటంలో ఆలస్యమైతే నగలకింద యిస్తామన్న రొఖ్ఖం దొరక్క-కన్యాదాత 'ఇంకేముంది పిల్ల కింక పెళ్లేకాదు.వస్తామన్న పెళ్ళివారు రాకమానితే అనుకొని కాళ్లూవేళ్లు విరగగొట్టుకుని తిరిగి తానింకబ్రతికి లాభంలేదు ప్రజలమొఖం ఎల్లాచూడనా అనికొని, గన్నేరుకాయలనుకొని బాదంకాయలు చితక్కొట్టుకు తిని ప్రాణోపవేశం పడ్తాడు. తీరో పెళ్ళివారు వస్తారు బ్రతకాలని ఉంటుంది. కాని విషంతిన్నానన్న గుర్తుతో లేవలేడు. నిజానికి బాదంకాయలేఅన్నది తెలిసేవరకూ మంచిగమ్మలు.

ఆఖరిది ఆరోకథ :

శాస్త్రశిష్టాచారసంపత్తిగల వాడూ, పట్టుదలగలవాడూ అయినా, తప్పివస్తే మాలమాదిగల సేవచేయించుకొని, తన పని 'కాస్తా తీరాక, ఒళ్లు గగుర్పొడిచి వాళ్లని హింసించాలని చూడబోవటం, ఇంతలోకే యేలా స్వాధ్యాయవేత్త ఖర్మంచాలక క్రైస్తవుడే వీళ్ల చేతిలో బాధింపబడితే పై ప్రాణాలుపైనే పోగొట్టుకోటం చక్కగా నిరూపితాలైనాయి. అన్నిటికేంగాని, చిన్న చిన్న వ్యాపారాలు చేసికొని, బల్లతోలుకు బ్రతికే జనాన్ని పడగొట్టి మోటార్లువేసి డబ్బుగుంజేవారిపై కడుపుమండిన జనాల తిరుగుబాటు ప్రాముఖ్యత వహిస్తోంది.

—అత్తిలివా

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street. Vepery P.O, M
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.